మన
# నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL / 25 / A4284

రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 134 | 10 శుక్రవారం, మార్చి 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-
హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ట, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం

# మూడు రాష్ట్రాల్లో... ముగిసిన పోలింగ్

- భారీగా పోలింగ్ శాతం నమోదు
- అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ ప్రశాంతం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 9( నేషనలిస్ట్ వాయిస్):**
అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఇసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ ముగిసింది. ఇప్పటి వరకు పుదుచ్చేరిలో 86.92 శాతం, అసోంలో 84.42 శాతం, కేరళంలో 75.01 శాతం పోలింగ్ నమోదు అయిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం అసోం (126), కేరళం (140), పుదుచ్చేరి (30) లలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఈ ఎన్నికల పోలింగ్ వేళ.. ఏర్పాట్లను ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఆయా రాష్ట్రాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మొత్తం 296 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

...మిగతా 2 లో...



## వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

- శాంతియుత నిరసనలతో ఖండించాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**చిత్తూరు,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**
పత్రికల్లో, మీడియాల్లో ఏమైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చున్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు.

...మిగతా 2 లో...



## జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

- గతంలో కెసిఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా
- పొంగులేటిపై ఆరోపణలు కాదు.. దమ్ముంటే చర్చకు రావాలి
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**
మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా ఈ విషయంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు.

...మిగతా 2 లో...

## తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత పిల్లలదే

మంత్రి సీతక్క వ్యాఖ్యలు



**మహబూబాబాద్,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**
తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ప్రేమగా చూసుకోవడం పిల్లల బాధ్యత అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. సమాజంలో వృద్ధుల పట్ల గౌరవం, ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మంత్రి సీతక్క పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందించే పౌష్టికాహార పంపిణీని కచ్చితంగా పర్యవేక్షించేందుకు స్మార్ట్ ఫోన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా లబ్దిదారుల వివరాలు, ఆహార పంపిణీ వివరాలు నమోదు చేసి పారదర్శకత పెంచుతామని చెప్పుకొచ్చారు. ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడం తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం


- రాజకీయాల్లో నిఖార్సయిన నేత
- జీవన్‌రెడ్డిని ప్రశంసించిన కెటిఆర్
- జగిత్యాలలో జీవన్‌తో భేటీ

**జగిత్యాల,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**
ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని కేటీఆర్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ..

...మిగతా 2 లో...

## కెసిఆర్‌తో కలసి రాష్ట్రం కోసం పనిచేస్తా

- కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు చింతిస్తున్న జనం
- 27 నెలలుగా కాంగ్రెస్‌లో క్షోభ అనుభవించాను
- మీడియాతో మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆవేదన



**జజగిత్యాల,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**
తాను భారత రాష్ట్ర సమితిలో చేరాలని నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి తెలిపారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భేటీ అయ్యారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. తన శేష జీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేస్తే.. రాష్ట్ర భవిష్యత్‌కు పాటుపడవచ్చని అన్నారు.

...మిగతా 2 లో...

## జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం..!

- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం
- డిప్యూటి సిఎం భట్టి విక్రామర్క వెల్లడి




**ఖమ్మం,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**
కేసీఆర్ హయాంలోని పదేళ్లు వనరులు దోపిడీకి గురికావటం వల్ల తెలంగాణలో అభివృద్ధి జరగలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విద్య ద్వారానే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం ఎర్రుపాలెంలో అమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా ప్రతి విద్యార్థి ఎదగాలని ఆకాంక్షించారు. జూన్ 2వ తేదీ నుంచి విద్యార్థులకు అల్పాహార పథకం అమల్లోకి తీసుకువస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రతి బిడ్డకు ఉచితంగా మెరుగైన విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో 100 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుడతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

...మిగతా 2 లో...

## పొంగులేటి కాదు... పొంగులూటీ...

- బాంబులు పేలుతాయన్న బాంబులేటి
- అవినీతిని దాచిపెట్టేందుకు నానా తంటాలు
- క్రషర్‌లో జరిగిన అవినీతిని సిఎం స్వయంగా చెప్పారు
- నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివైతే ..హైడ్రా ఎందుకు వెళ్లలేదు
- గొల్లపల్లి రిజర్వాయర్ వ్యతిరేక రైతులకు హరీష్ సంఘీభావం



**వనపర్తి,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**
పొంగులేటి కాదు ఆయన బాంబులేటి.. పొగరులేటి అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పవిత్రమైన అంబేద్కర్ సచివాలయంలో పొగరులేటి మాటలు.. నిజాలు దాచి అబద్దాలు మాట్లాడారని ఆగ్రహించారు. ఆయన మాటలు వింటే.. ఆయన ఎంత డిఫెన్స్‌లో ఉన్నారో అర్థమవుతోందని అన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన ఇదివరకు బాంబులు పడతాయని చెప్పి ఏడాది దాటిందని.. అవి తుస్సుమన్నాయని సెటైర్లు గుప్పించారు. ఆయనలో సరుకు లేనందునే తిట్ల దండకం అందుకున్నారని ధ్వజమెత్తారు. పిట్ట కథలు.. తిట్లు.. ఆయన ఆయాసం.. అన్నీ చూశామని విమర్శించారు. ఆయనతో పాటు సహచర మంత్రుల అవినీతి చిట్టా కూడా చదివారని ఎద్దేవా చేశారు. గురువారం వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో హరీశ్‌రావు పర్యటించారు. గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు.

...మిగతా 2 లో...

# మూడు రాష్ట్రాల్లో... ముగిసిన పోలింగ్

మొదటిపేజీ తరువాయి

కేరళ, పుదుచ్చేరిలలో సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగియగా.. అస్సాంలో ఐదు గంటలకే పూర్తయ్యింది. మూడు ప్రాంతాల్లోనూ ఈసారి భారీ సంఖ్యలో ఓటర్లు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలోని 140 నియోజకవర్గాల్లో 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. పోలింగ్ బూత్‌లకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5గంటల వరకు 75శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి కోయ్‌కోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 74.06శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి స్వల్పంగా పెరిగింది. అస్సాంలో 126 నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు 84శాతానికిపైగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. గత ఎన్నికల్లో 82శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి మరింత పెరిగింది. దల్‌గావ్‌లో అత్యధికంగా 94.57శాతం పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలోనూ భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం 30 అసెంబ్లీ స్థానాలుండగా.. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. ఐదు గంటల వరకే 86శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇది మరింత పెరగనుంది. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ.. అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో క్యూ లైన్‌లలో ఉన్నవారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్‌కు అనుమతించినట్లు సమాచారం. ఈ ఏడాది మార్చి రెండో వారంలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని అసెంబ్లీలకు కేంద్రం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకటించింది. అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపింది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23వ తేదీన ఒక దశలో ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని పేర్కొంది. మే 4వ తేదీన ఈ ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు పక్రియ చేపట్టడతామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# పొంగులేటి కాదు.. పొంగులూటీ...

మొదటిపేజీ తరువాయి

అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, మల్లు భట్టి విక్రమార్క, సీఎం సోదరుల అవినీతి బాగోతాన్ని పొంగులేటినే బయట పెట్టారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన పొంగులేటి కాదు పొంగులూటీ అని వ్యగ్యంగా మాట్లాడారు. ఆయన క్రషర్‌లో జరిగిన అవినీతిని సీఎం రేవంత్‌రెడ్డినే స్వయంగా బయటపెట్టారని ఆరోపించారు. ప్రతిపక్షం కాదని.. తామే అన్ని విషయాలు వెలుగులోకి తెస్తామని అసెంబ్లీలోనే సీఎం చెప్పారని అన్నారు. సీఎం ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు వెళ్లి.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అనుమతులు లేవని నివేదిక ఇచ్చారని ప్రస్తావించారు. మరి అధికారులు, సీఎం చెప్పింది తప్పా.. పొంగులేటి చెప్పింది తప్పా అని ప్రశ్నించారు.. ఇదంతా మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమని ఆరోపించారు. తాము ఈ విషయాన్ని లేవనెత్తిన తర్వాతనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన కంటైనర్‌పై రంగు వేసి, కాంగ్రెస్ జెండా తీసేశారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నాదర్‌గుల్ భూములను 22 ఏ లో పెట్టి రక్షించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ భూములను ఎందుకు దాస్తున్నారని.. వీటి గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇవి ప్రభుత్వ భూములని ఆర్డీఓ కోర్టులో చెప్పారని.. మరి ఎందుకు అక్కడి భూమిలో రోజుకోక కొత్త బోర్డు వెలుస్తోందని నిలదీశారు. ఇవి ప్రభుత్వ భూములు అయితే ఆక్రమణదారులపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అడిగారు. రెవెన్యూ మంత్రిగా పొంగులేటి ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. హైడ్రా పంపించి, కాంపౌండ్ వాల్ కూలగొట్టి, ఆక్రమణలను కూల్చి రేవంత్‌రెడ్డి సర్కార్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని హరీశ్‌రావు సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాంబులు తుస్సుమన్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మా మంత్రి కంపెనీలో జరిగిన అవినీతిని మా అధికారులే గుర్తుపట్టారని అసెంబ్లీలో సీఎం చెప్పారు. అనుమతులు లేకుండా నడుపుతున్నారని రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధికారులు నోటీసులు ఇచ్చారు. అంటే సీఎం చెప్పింది తప్పా.. మంత్రి పొంగులేటి చెప్పింది తప్పా.. అదేంటో తెలియాలన్నారు. నాలుగు శాఖల అధికారులు మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. నీ కంపెనీకి మైన్ లేదని అసెంబ్లీలో ఎందుకు చెప్పలేదు. సీఎం తప్పు చెప్పారని మంత్రి పొంగులేటి ఎందుకు చెప్పలేదు. నువ్వు పొంగులేటి కాదు.. పొంగులూటీ అని దుయ్యబట్టారు. రెండున్నరేళ్లుగా ఎందుకు భూమిని స్వాధీనం చేసుకోలేదు. ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకోకుండా హైడ్రా ఏం చేస్తుంది. పేదల ఇళ్లపైకేనా హైడ్రా వెళ్తుందని హరీశ్ రావు ప్రశ్నించారు.

# కెసిఆర్‌తో కలసి రాష్ట్రం కోసం పనిచేస్తా

మొదటిపేజీ తరువాయి

27 నెలలుగా చాలా క్షోభ అనుభవించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసినప్పుడు.. భావోద్వేగానికి గురయ్యాను. బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తారని కాంగ్రెస్‌కు ఓటేశారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడిచింది. 2014లోనే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చింది. కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినా.. కాంగ్రెస్‌లోనే కొనసాగా. రాష్ట్ర అవసరాల కోసం ఇప్పుడు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తా అని జీవన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ సూచన మేరకు కేటీఆర్ తన ఇంటికి పార్టీలోకి ఆహ్వానించేందుకు వచ్చారని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ లో చేరుతానని వెల్లడించారు జీవన్ రెడ్డి. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్ లకు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం భావోద్వేగానికి గురి చేసిందని.. ఇవాళ బీఆర్ఎస్‌తో కలవడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. గత 20 మాసాలుగా అవమానాలు తట్టుకుని ఓపిక పట్టానని అన్నారు. ఎందరి ప్రభుత్వాలో చూశాను.. కానీ, ఈ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని అన్నారు జీవన్ రెడ్డి. ప్రజాభిప్రాయం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని..కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని అన్నారు జీవన్ రెడ్డి. కేసీఆర్, జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్దాలకుపైగా స్నేహం ఉంది. గతంలోనూ ఆయన్ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించాం. కాంగ్రెస్‌తో అనుబంధం వల్ల జీవన్‌రెడ్డి గతంలో పార్టీ మారలేదు. ఇప్పుడు మరోసారి జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించాం. రెండ్రోజుల్లో కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలుస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసుగు చెందారు. రైతులకు రూ.27 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు. హామీలు అమలు చేయకుండా అనవసర మాటలు మాట్లాడుతున్నారు. ఇదిలావుంటే సీఎం రేవంత్ రెడ్డి భాషపై జనాల్లో చర్చ జరుగుతోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.

# నగరంలో ట్రాఫిక్ చిక్కుల ముడివిప్పే ప్రయత్నం

## షేక్‌పేట నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు మోడల్ కారిడార్

## బస్సులో ప్రయాణించి పరిస్థితులు అధ్యయనం చేసిన అధికారులు

**హైదరాబాద్,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):** భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లై ఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు , నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎన్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్-1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ , జి ముకుంద రెడ్డి , ప్రియాంక ఆలా, కాజల్ , కె. శ్రీనివాస్, ఎస్.రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డి. ధనలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

మొదటిపేజీ తరువాయి

పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ అన్నివిధాల ఆదరించింది

మొదటిపేజీ తరువాయి

జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14 సార్లు బీ ఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు..? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేక సార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ జీవన్ రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే చర్యలు తప్పకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా? అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవిత చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# జూన్ 2నుంచి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం..!

మొదటిపేజీ తరువాయి

మధిర నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో చివరి భూములకు సాగునీరు అందించాలన్నదే తన సంకల్పమని తెలిపారు. రూ.36 కోట్లతో కట్టలేరు కాలువల మరమ్మతులను చేపట్టామని అన్నారు. ఎన్నెస్పీ కెనాల్ మూడవ జోన్ పరిధిలో ఉన్న భూములను రెండవ జోన్ కిందకు తీసుకువచ్చి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందజేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికొదిలేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీతారామకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువస్తున్నామని.. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం జరుగుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. కట్టలేరు ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు.

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్, జీవన్ రెడ్డికి దశాబ్దాలకుపైగా పరస్పర గౌరవం, స్నేహం ఎప్పుడి నుంచో ఉంది. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. ఆ రోజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక ఆడిటోరియంలో మీటింగ్ జరిగింది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన శాసనసభ్యులు.. కానీ కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పివారి మైక్ అందిస్తే వారు నేరుగా అభినందనలు చెప్పి జగిత్యాల ప్రజల తరపున నేను మిమ్మల్ని ఒకటి అడగ దలచుకున్నా.. బోర్నపల్లి గ్రామానికి సంబంధించి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట చిన్నగా అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం. అని చెప్పొచ్చు. జీవన్ రెడ్డి మీదున్న గౌరవం, ప్రేమ ఎట్టాంటిదంటే.. కేసీఆర్ రూ.70 కోట్ల బ్రిడ్జిని అక్కడికక్కడే మంజూరు చేసి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి మంజూరు చేసిన బ్రిడ్జిని ఇచ్చారన్నారు.. 2014 ఎన్నికల ముందు కేసీఆర్ జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. జీవన్ రెడ్డి నిబద్ధత గల నాయకుడు.. కాంగ్రెస్‌లోనే కొనసాగారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల చాలా గట్టిగా మాట్లాడే నాయకుడు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డి ఇద్దరూ కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవిందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారు ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి 300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి.. అని చెప్పి నిండు శాసనసభలో కేసీఆర్ ఆనాడు జీవన్ రెడ్డిగారికి ఎలాంటి భేషజానికి పోకుండా ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది.


# సంపాదకీయం

## ఒక యుద్ధం..అనేక చేదు అనుభవాలు !

ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ది చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా÷– నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారతదేశ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్

## -నేడు ఆయన వర్ధంతి





మొరార్జీ దేశాయి భారత స్వాతంత్ర్య సమర యోధునిగా, జనతా పార్టీ నాయకునిగా, భారత మాజీ ప్రధానిగా సేవలు అందించాడు. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు.అతని తండ్రి ఉపాధ్యాయుడు. అతను1977 మార్చి 24 నుండి 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవలనందించాడు. అతను దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచాడు. అతను భారతదేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టాడు. వాటిలో: బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టాడు. అంతర్జాతీయంగా దేశాయ్ తన శాంతి ఉద్యమం ద్వారా కీర్తి సంపాదించాడు. అతను దక్షిణ ఆసియాలో ప్రత్యర్థి దేశాలైన పాకిస్తాన్, భారతదేశం మధ్య శాంతిని ప్రారంభించడానికి అనేక ప్రయత్నాలు చేసాడు. 1974 మే 18న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ లో జరిగిన మొదటి అణుపరీక్ష తరువాత అతను చైనా, పాకిస్తాన్ లతో స్నేహపూర్వక సంబంధాలను పునరుద్ధరించడానికి సహాయం చేసాడు. 1971లో జరిగిన భారత్–పాకిస్తాన్ ల మధ్య జరిగిన యుద్ధం వంటి అంశాలలో సాయుధ పోరాటం నివారించడానికి కృషి చేసాడు. మరోవైపు భారతదేశపు నిఘావ్యవస్థ (రా)ను దెబ్బతీసి పాకిస్తాన్‌లో భారత నిఘా లేకుండా చేసిన వ్యక్తిగా అతనిపై పలు విమర్శలు ఉన్నాయి.మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశాడు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. పదవీ విరమణ తరువాత అతను ముంబైలో నివసించి తన 99వ యేట 1995 ఏప్రిల్ 10 న మరణించాడు. మురార్జీ దేశాయి జీవించింది 99 సంత్సరాలు.. కానీ ఆయన తనకు 24 ఏళ్లే అని చమత్కరించేవారు. అవును మరి ఆయన పుట్టిన రోజు నాలుగేళ్లకు ఒకసారే వస్తుంది.

# నేడు ప్రపంచ హోమియోపతి దినోత్సవం

## -హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యేల్ హనెమన్ జయంతి

హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యేల్ హనెమన్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటారు. హోమియోపతీ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక వైద్యవిధానం. జర్మన్ దేశానికి చెందిన డా. క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యేల్ హనెమన్ అనే ఫిజిషియన్ 1796లో ఈ వైద్యవిధానాన్ని, ఈ మాటని కనిపెట్టాడు.మలేరియా వ్యాధి నివారణకు సంకోనబెరడుతో చేసిన మందువాడుతారని తెలుసుకున్న హనెమన్ ఆ బెరడు మలేరియాను ఏ విధంగా నివారిస్తుందో తెల్సుకోవాలనుకున్నాడు. అందుకోసం సింకోనా బెరడుతో కషాయం తయారు చేసుకొని తనమీద తన స్నేహితులమీద ప్రయోగాలు జరిపి, ఏ ఔషదమైతే ఆరోగ్యవంతునిలో ఒక వ్యాధి లక్షణాలను కలుగజేస్తుందో ఆ లక్షణాలున్న వ్యాధికి ఆ ఔషదం ఇచ్చినప్పుడు వ్యాధి నయమవుతుందని తెలుసుకున్నాడు. తన ప్రయోగ ఫలితాలను గురించి 1976లో లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించడంతోపాటు, ఈ నూతన వైద్య విధానికి హోమియోపతి గా నామకరణం చేశాడు. ప్రస్తుతం వైద్య విధానాల్లో హోమియోపతి వైద్యం రెండవ స్థానంలో ఉంది. 1813 సంవత్సరంలో జర్మనీలో టైఫాడ్ జ్వరం వచ్చినప్పుడు హోమియోపతి వైద్యంద్వారా ఆ వ్యాధి అరికట్టబడింది. 66 దేశాల్లో ఈ హోమియోపతి వైద్యం ప్రాచుర్యంలో వుండగా, భారతదేశ జనాభాలో 38 శాతం ప్రజలు ఈ వైద్యాన్ని పొందుతున్నారు.




# మూడు రాజధానులంటూ రుషికొండను మింగారు

**ఇప్పడేమో మావిగన్ పేరుతో జోకర్‌గా మారారు**

**వైఎస్సార్ పేరు తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు**

**జగన్ తీరుపై ఘాటు విమర్శలు చేసిన వైఎస్ షర్మిల**

**అమరావతి,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్)**

వైఎస్సార్ తన జీవిత కాలం వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడుగా జగన్ మారారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇదేనా వారసత్వం అంటే అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా జగన్ మిగిలారని సెటైర్లు గుప్పించారు. సంక్షేమానికి సారథి దివంగత నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రతీ పథకం ప్రజల కష్టం, కన్నీళ్ల నుంచి పుట్టిందేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకుడు, మా నాన్న వైఎస్సార్ ప్రజాప్రస్థానం తెలుగు ప్రజల గుండెల్లో ఈరోజుకి పదిలమని షర్మిల చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 9, 2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం దాక ప్రజాహితమే పరమావధిగా వైఎస్సార్ చేపట్టిన1457 కిలోమీటర్ల పాదయాత్ర సాగిందని తెలిపారు. ఈ పాదయాత్రకు 23 ఏళ్లని చెప్పారు. వారసులమని చెప్పుకునే జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ పేరును వాడుకున్నారు తప్పితే.. ఆయన ఆశయాలకు వారసులు ఎందుకు కాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీలో నిజంగా వైఎస్సార్ ఐడియాలజీ ఉంటే జగన్ సీఎం అయ్యాక కూడా వైఎస్సార్ జలయజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. 'మాట తప్పం మడమ తిప్పం' అనే వైఎస్సార్ లైన్ వాడుకోవడం తప్పిస్తే, పూర్తి మద్యపాన నిషేధమని మాట ఇచ్చి, కల్తీ మద్యం అమ్మి 'ఓన్లీ క్యాష్' మాఫియా ఎందుకు చేశారని షర్మిల ప్రశ్నించారు. వారసులమని చెప్పుకొనే జగన్ కేవలం వైయస్సార్ పేరును మాత్రమే వాడుకున్నారని వైఎస్ షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ వారసులు కాలేదని ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్ భావజాలం ఉంటే జలయజ్ఞం ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు 'వైఎస్ఆర్ వ్యతిరేకించిన భాజపాకి దత్తపుత్రుడిగా ఎందుకు మారారు? ఎస్సీలు, క్రైస్త్రవులపై దాడులు జరుగుతుంటే మౌనంగా ఎందుకున్నారు? మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి ప్యాలెస్‌లు కట్టారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా మిగిలారు. వైయస్సార్ హయాంలో రాష్ట్రంలోనే ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే మౌనంగా ఎందుకున్నారని షర్మిల ప్రశ్నించారు.



# మక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

## కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్న సీతక్క

**మహబూబాబాద్,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు గార్ల మండలం సీతంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కొనుగోలు కేంద్రాలపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు మంత్రి సీతక్క రంగంలోకి దిగారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సీతక్క పర్యటించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. వారి కోరిక మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్నలు ప్రైవేట్ దళారీలకు విక్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా రైతులకు మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ. 2,400 గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. ఒక్క ఎకరాకు 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు కాకుండా 50 క్వింటాలు పండించినా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఇబ్బంది పడకుండా పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క భరోసా

# ప్రియదర్శిని డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు విజయవంతం

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**

స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాల తన విద్యా సేవలో 25 వ సంవత్సరాలను విజయవంతంగా పూర్తి చేసుకుని వేడుకలను కొత్తగూడెం క్లబ్ లో గురువారం ఘనంగా నిర్వహించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు హాజరై విద్యారంగంలో చేసిన సేవలను గుర్తు చేశారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగితే విజయాలు తలుపు తడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నయీమ్ పాషా మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ప్రతి విద్యా సంవత్సరంలో గోల్డ్ మెడల్స్ సాధించడమే కాకుండా క్రీడల్లో నైపుణ్యాన్ని కనబరుస్తున్నారని చెప్పారు. డైరెక్టర్ శ్రీరాముని చలపతిరావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించి మారుతున్న సమాజానికి అనుగుణంగా జీవించాలని కోరారు. ఈ వేడుకలలో ఆకర్షణీయంగా ఈటీవీ పాడుతా తీయగా ఫేమ్ లక్ష్మీ శ్రావణి శ్రీనివాస్ పాల్గొని తమ పాటలతో విద్యార్థులు ఉత్సాహపరుస్తూ వేడుకలకు మరింత శోభన తెచ్చారు. ప్రసంగాల అనంతరం కళాశాల విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులను ఉత్సాహ పరిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ టాపర్స్ కి ముఖ్యఅతిథులు చేతులు మీదుగా జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త మండవ సుబ్బారావు వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్ పిడి కాసి మల్ల రమేష్ అధ్యాపకులు భద్రు రఫీ వేణు శ్రీనివాస్ మాధురి భారతి జ్యోతి ప్రగతి జహేద షర్మిల తదితరులు పాల్గొన్నారు.



# కారుకొండ "బౌద్ధ గుహలను" సందర్శించిన విద్యార్థులు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కారుకొండ రామవరం ప్రాంతంలో ఉన్న ప్రాచీన బౌద్ధ గుహలను గురువారం రామచంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. ఈ పర్యటన విద్యార్థులలో చరిత్రపరమైన అవగాహనను పెంపొందించడం బౌద్ధ సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేయడం లక్ష్యంగా నిర్వహించబడింది. పర్యటన సందర్భంగా అధ్యాపకులు బౌద్ధ గుహల నిర్మాణ శైలి వాటి చారిత్రక ప్రాముఖ్యత బౌద్ధ మత విస్తరణలో వాటి పాత్ర వంటి అంశాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. గుహలలో కనిపించే శిల్పాలు శాసనాలు నివాస నిర్మాణాల గురించి కూడా వివరించడం జరిగింది. విద్యార్థులు ఈ పర్యటన ద్వారా ప్రాచీన భారతీయ సంస్కృతి బౌద్ధ ధర్మం పురావస్తు సంపదపై విలువైన జ్ఞానాన్ని పొందారు. ఇటువంటి క్షేత్ర పర్యటనలు విద్యార్థులలో పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధ్యాపకులు తెలిపారు.




# తడపాకల్‌లో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**ఏర్గట్ల, ఏప్రిల్ 9 నేషనలిస్ట్ వాయిస్:**

ఏర్గట్ల మండలం తడపాకల్ గ్రామంలో డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరియు పదిహేనవ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ జింక స్వప్న అనిల్ తెలిపారు. ఈ పనులకు నిధులు మంజూరు చేయించడంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యల సునీల్ కుమార్ కృషి ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. ఇందుకు గాను గ్రామ ప్రజల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఈ పనులు దోహదపడనున్నట్లు స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తల్లిదండ్రుల అవగాహనతోనే సమాజంలో మార్పు సాధ్యం

## కమిషనర్ సీతా దయాకర్ రెడ్డి

### -బాలల భద్రత విద్య ఆరోగ్యం అందేలా సమగ్ర చర్యలు

### -కలెక్టర్ అంకిత్ విజయవంతంగా చైల్డ్ రైట్స్‌పై ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షా సమావేశం






**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**

తల్లిదండ్రుల అవగాహనతోనే సమాజంలో మార్పు కనిపిస్తుందని కమిషనర్ సీతా దయాకర్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో బాలల హక్కుల పరిరక్షణ సంక్షేమ కార్యక్రమాల అమలు బాలల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకు బాలల హక్కులపై సమీక్ష సమావేశం గురువారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించ బడింది. ఈ సందర్భంగా బాలల హక్కుల కమిషనర్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల అవగాహనతోనే సమాజంలో మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో మత్తు పదార్థాల నియంత్రణ మరుగుదొడ్ల వినియోగం బాల్య వివాహాల నివారణ లింగ నిర్ధారణ కేసుల అరి కట్టడంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి కమిషన్‌కు తెలియజేస్తే తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల ఎదుగుదలకు కీలకమని పేర్కొంటూ పోషకాహారం ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా ములకలపల్లి ధర్మన్న నగర్‌లో అంగన్వాడీ కేంద్రం లేకపోవడం గమనించామని అటవీ శాఖ అనుమతుల సమస్యల కారణంగా పిల్లలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అవసరమైతే కంటైనర్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజన్ సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వ్యవసాయ కూలీల పిల్లల సమస్యల పరిష్కారానికి అంతర్రాష్ట్ర స్థాయిలో సమన్వయం అవసరమని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ బాలల భద్రత విద్య ఆరోగ్యం అందేలా సమగ్ర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో బాలసదన్ ద్వారా పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని, 1098 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా పిల్లల సమస్యలపై తక్షణ స్పందన అందిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ నుండి కళాశాల స్థాయి వరకు మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో పదో తరగతి ఉత్తీర్ణతలో బాలికలు ముందంజలో ఉన్నారని గిరిజన ఆశ్రమ పాఠశాలలతో పాటు అన్ని పాఠశాలల్లో పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 23 తరువాత బడిబాట కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లో డ్రాప్ అవుట్‌లపై ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల పర్యవేక్షణ కోసం మండల స్థాయిలో ప్రత్యేక అధి కారులను నియమించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో సికిల్ సెల్ అనీమియా నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి హెల్త్ క్యాంపుల ద్వారా కేసులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాల నివారణతో పాటు గంజాయి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన పోక్సో, బాల్య వివాహ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గిరిజన అటవీ ప్రాంతాల్లో గంజాయి రవాణా వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాల ద్వారా గల్లంతైన పిల్లలను గుర్తించి రక్షణ చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సందర్భంగా 2023, 2024, 2025 సంవత్సరాలలో జిల్లాలో నమోదైన పోక్సో, బాల్య వివాహాలు తదితర కేసుల వివరాలను సమగ్రంగా వివరించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిషన్‌కు వివరించారు. బాలల హక్కుల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి బాలుడికి సురక్షి తమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కట్టుబడి పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ద్వారా బాలల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలు తీసుకోవలసిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కమిటీ మెంబర్లు కంచికచర్ల వందన గౌడ్, చందన, అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత, వచన్ కుమార్, భరత రాణి, సుమిత్ర దేవి, సాధిక్ భాష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, ఖమ్మం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజేత సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసన్ కార్మికులకు ఏ.పీ.ఎస్.ఈ.బి సర్వీస్ రూల్స్ అమలు చేయాలి

## తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ డిమాండ్

**తూప్రాన్, ఏప్రిల్,9. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:.**

మెదక్ జిల్లా తూప్రాన్ లో విద్యుత్ డివిజినల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఆర్టిసన్ కార్మికులు టెంట్ వేసుకొని ధర్నా నిర్వహిస్తూ నిరవధిక సమ్మెకు దిగారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ ఆక్షన్ కమిటీ అద్వర్యంలో తమను ఆర్టిసన్ కార్మికుల నుండి ఏ. పి.ఎస్.ఈ. బి లో సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిసన్ కార్మికులు మాట్లాడుతూ ఆర్టిసన్ ఉద్యోగుల నుండి పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రతా కల్పించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తూప్రాన్ విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో మెదక్ జిల్లా జేఏసీ పిలుపు మేరకు ధర్నా సమ్మెబాట చేపట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తూ హెచ్చరించారు.




# తూప్రాన్‌లో డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 10,000 జరిమానా

**తూప్రాన్, ఏప్రిల్ 9. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ. మల్లేష్ (తండ్రి: అగమయ్య) అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ తనిఖీలలో చిక్కాడు. అనంతరం అతన్ని మెదక్‌లోని జేఎఫ్‌సీఎం స్పెషల్ మొబైల్ కోర్టు ఎదుట హాజరుపరచగా, కోర్టు కేసును విచారించి రూ. 10,000/- జరిమానా విధించింది. డ్రంకెన్ డ్రైవ్ చేయడం తీవ్రమైన నేరమని, ఇది ప్రాణాలకు ముప్పు కలిగించే చర్య అని కోర్టు స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పోలీసుల విజ్ఞప్తి ఈ సందర్భంగా ఎస్ఐ గంగరాజు తెలిపారు. రోడ్డు భద్రత కోసం నిరంతరం తనిఖీలు కొనసాగుతాయనీ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దు మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడండి. తూప్రాన్ పోలీసులు చేపడుతున్న డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు కేవలం చట్టపరమైన చర్యలు మాత్రమే కాకుండా, ప్రజల ప్రాణ భద్రత కోసం తీసుకుంటున్న ముఖ్యమైన చర్యలుగా నిలుస్తున్నాయి.



# రైటర్ బస్తీలో విస్తరిస్తున్న బెల్టు షాపులు..!

-నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగులు-రహదారి పక్కనే మద్యం సేవింపు

-ఇబ్బందులు పడుతున్న మహిళలు -నేడు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రైటర్ బస్తి గొల్లగూడెం ఏరియాలో మద్యం బెల్ట్ షాపులు దశలవారీగా విస్తరిస్తున్న పరిస్థితి నెలకొంది. బస్తీలో మద్యం అందుబాటులో ఉండడం మూలంగా కొందరు యువకులు మద్యం సేవించి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా కొందరు మద్యం మత్తులో యువకులు ఇతరులపై దాడులు చేసిన సంఘటనలు అనేకంగా ఉన్నాయని స్థానికులు బహిరంగంగా చెప్పడం గమనార్హం. ఇలాంటి వారిని గుర్తించి బస్తీ బహిష్కరణ చేయడంతో పాటు ఊరేగించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. తాజాగా బస్తీలో ఒక కిరాణా షాపు ప్రారంభించగా దాని ముసుగులో మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు కొంతమంది విలేకరుల దృష్టికి తీసుకువచ్చారు. ఇదే షాప్ ముందు సెట్టింగ్ సైతం ఏర్పాటు చేయడం వల్ల ఈ దారి గుండా మహిళలు పోవాలంటే భయాందోళన చెందుతున్నారు. బెల్ట్ షాపుల ఏర్పాటుతో ఇబ్బందులు కలిగిస్తున్న నిర్వాకులపై ఎక్సైజ్ అండ్ పోలీస్ శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



# అర్ధరాత్రి అక్రమంగా కూల్చివేతలకు అడ్డాగా రామగుండం...





**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే ప్రజలు తిరగబడతారు... ప్రజలకు అండగా బిఆర్ఎస్ నిలుస్తుంది.. గుర్తుతెలియని వ్యక్తులచే కూల్చివేతలు చేస్తే తరిమికొట్టండి.. చోద్యం చూస్తున్న పోలీసులు, అధికారులు తగిన మూల్యం చెల్లించుకుంటారు: హరీష్ రెడ్డి హెచ్చరిక..! నెంబర్ ప్లేట్ లేని జెసిబిలను తగలబెట్టండి.. ప్రజలకు అండగా నిలుస్తాం.. బాధితుల పక్షాన న్యాయ బద్ధంగా పోరాడుతాం... రాజ్ ఠాకూర్ అన్యాయాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం: బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్ రెడ్డి.**

**నేషనలిస్ట్ వాయిస్, గోదావరిఖని :**



గత రెండు రోజుల క్రితం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సామాన్య కుటుంబం జీవనోపాధికై తమ దగ్గర ఉన్న ఆస్తిపాస్తులు అమ్ముకొని వ్యాపారం చేసుకుంటుంటే అక్రమ కట్టడాలని మున్సిపల్ అధికారులు సింగరేణి స్థలమని సింగరేణి అధికారులు చలో కూల్చేయండి నేను చూసుకుంటా అని ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ అర్ధరాత్రి దొంగల్లా పోలీసులను అడ్డుపెట్టుకొని కూల్చివేతలు చేస్తే.. సహించేది లేదని, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్నాం న్యాయస్థానంలోనే తేల్చుకుంటామని ఎదురు నిలిచిన అభాగ్యురాలు కుటుంబానికి మేమున్నామని అండగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్ రెడ్డి బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో నెంబర్ ప్లేట్లు లేని బుల్డోజర్ వ్యవస్థతో రేవంత్ రెడ్డి పేదల ఇండ్లు కూలుస్తున్నారని రామగుండంలో రాజ్ ఠాకూర్ అక్రమ చట్టం పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకొని అర్ధరాత్రి దొంగల్లా నెంబర్ ప్లేట్లు లేని జెసిబి లతో పేద మధ్యతరగతి చిరు వ్యాపారులను రోడ్డున పడేస్తూ.. వారి సముదాయాలను కూల్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి విలువలు లేకుండా ఒకపక్క రామగుండం నగరం అభివృద్ధి అంటూ కూల్చివేతలకు శ్రీకారం చుట్టి వేలాది మందిని బజారున పడేశాడని, అన్ని విధాలుగా న్యాయ చట్టబద్ధంగా ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మించుకున్న వ్యాపార సముదాయాన్ని కూల్చడానికి మీరు ఎవరని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థను కూడా కించపరిచే విధంగా చేస్తున్న మీ చర్యలను ప్రజాక్షేత్రంలో మీరు చేస్తున్న అరాచకాలను ఎండా కడతామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు నెంబర్ ప్లేట్ లేని జెసిబి వాహనాలతో ఎక్కడైనా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కూల్చివేతలకు దిగితే వారిని తరిమి కొట్టండి జెసిబిలను తగలబెట్టండి మీకు అండగా బిఆర్ఏస్ పార్టీ న్యాయ బద్ధంగా పోరాడేందుకు నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఇకనైనా అన్యాయాన్ని ఎదిరిస్తూ అక్రమాలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పోలీసులు చట్టబద్ధంగా ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి గుర్తు తెలియని వ్యక్తులకు కాపలా కాయడమేంటని ప్రజా పౌరులుగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నడుచుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని అలాంటిది తమ కార్యకర్తలపై అమానుషంగా వ్యవహరిస్తూ చేయి చేసుకోవడం ఫోన్ లాక్కోవడం భారత న్యాయ శిక్షాస్మృతి ప్రకారం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నగరాన్ని అద్భుతంగా సుందరీకరిస్తాం వ్యాపార అభివృద్ధికి కృషి చేస్తామని ప్రగల్భాలు పలికే ఎమ్మెల్యే ఈ ప్రాంత వ్యాపారుల సముదాయాలు కూల్చి.. ఇతర ప్రదేశాలకు వెళ్లేలా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒకపక్క ఈ ప్రాంతం తీవ్ర కాలుష్య కూరల్లో చిక్కుకుందని అందులో నుండి బయటపడేందుకు ఈ ప్రాంతంలో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేసి ప్రజలను రక్షించాల్సిన నాయకులు మరింత కాలుష్యం కోరల్లో చిక్కుకునేలా బొగ్గు ఆధారిత పరిశ్రమలు తీసుకు వచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎండగడతామని ప్రజలతో కలిసి కాలుష్య కోరల్లో చిక్కుకునే బొగ్గు ఆధారిత పరిశ్రమలు రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం కెసిఆర్ నాయకత్వంలో రాబోతుందని అప్పుడు కొంతమంది అరాచక పాలనకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హెచ్చరించారు. బాధితుల పక్షాన ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటామని ప్రజలు కలిసి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యురాలు తస్నీమ్ భాను, బొబ్బిలి సతీష్ యువజన విభాగం అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, అల్లీగణేష్, నడిపెల్లి సాయి, పోయిల రవి, కడమండ శ్రీహరి, కొండా సురేష్, జీనత్ తదితరులు పాల్గొన్నారు.

# గుంజపడుగు పంప్ హౌస్ లో చేపలు పట్టుకోకుండా అడ్డుకుంటున్న ఇరిగేషన్ అధికారులు

## -చేపల మృతికి కారణమైన ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్న మత్స్యకారులు

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఏప్రిల్ 09:**

గుంజపడుగు గ్రామంలోని అన్నారం సరస్వతి పంప్ హౌస్ గ్రావిటీ కెనల్ మరమ్మతుల నిమిత్తం ఇరిగేషన్, మెగా కంపెనీ అధికారులు నీటిని వదలడంతో నీటిమట్టం తగ్గి దాదాపు క్వింటాల్ చేపలు చనిపోయాని ఇంకా పూర్తిగా నీరు తగ్గి మత్స్యకారులకు చేపలు పట్టే అవకాశం కల్పించకుంటే దాదాపు రెండు మూడు టన్నుల చాప చనిపోయే అవకాశం ఉందని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ కాలేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా నిర్మించిన గుంజపడుగు పంప్ హౌస్ లో ఉపాధి దొరుకుతుందని, మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది అనే కారణంతో మా భూములను త్యాగం చేశామని గతంలో మెగా కంపెనీ వారు చేపలు పట్టిస్తుంటే జిల్లా మత్స్య అధికారితో చేపలు పట్టకుండా నోటీసులు ఇప్పించడం తోపాటు 30.12.2024 న ఇరిగేషన్ ఈఈ మహాదేవపూర్ నుండి పర్మిషన్ తెచ్చుకున్నామని అప్పటి నుండి గుంజపడుగు పంపుహౌస్ ఇరిగేషన్ అధికారులు నిబంధనలు పెడుతూన్నా భరిస్తూ చేపలు పట్టుకున్నామని పంప్ హౌస్ రిపేర్ సమయంలో చేపలు పట్టుకోడానికి మీకే అవకాశం ఇస్తామని నమ్మించి చేపలు పట్టకుండా అడ్డుకొని తీరా పంపుహౌస్ లో నీటిని తీసే సమయంలో మాకు సగం చేపలు ఇస్తేనే చేపలు పట్టే అవకాశము ఇస్తాం అనే నిబంధనలు పెడితే ఆ నిబంధనకు ఒప్పుకొని చేపలు ఇచ్చిన వాటితో సంతృప్తి చెందకుండా చాపలు పట్టనివ్వమని ఈ చాపలు మాకు సంబంధించినవి అని మాట్లాడుతూ ఈ రోజు చేపలు చనిపోవడానికి కారణం ఇరిగేషన్ అధికారులు అయ్యారని దీని ద్వారా మా ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్నాయని గతంలో పర్మిషన్ తీసుకున్నప్పటికీ మాకు చేపలు పట్టకూడదు అనే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే మమ్మల్ని అడ్డుకుంటూ చేపల మృతికి కారణమైన అన్నారం సరస్వతి పంపు హౌస్ ఇరిగేషన్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని మత్స్యకారులు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, సాధుల సదానందం ,సాధుల ఓదెలు, ఉదరి శివ, నూనె చంద్రయ్య, సాదుల తిరుపతి, కందుల శంకర్, సాదుల శ్రీకాంత్, అనవేన సదానందం, దశరథం తదితరులు పాల్గొన్నారు.

# "'మన ఊరు--మన భద్రత' కార్యక్రమం సర్పంచ్‌ల వెల్లడి"

**ఏప్రిల్ 9 ఏర్గట్ల నేషనలిస్ట్ వాయిస్**

ఏర్గట్ల : ఆర్మూర్ పట్టణంలో గురువారం నిర్వహించిన "మన ఊరు -- మన భద్రత" కార్యక్రమాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఏర్గట్ల మండల సర్పంచ్‌లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ భద్రతపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ ప్రజల సహకారం లేకుండా శాంతి భద్రతలు సాధ్యం కాదని, పోలీస్ శాఖతో సమన్వయం పెంచితేనే నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నట్లు సర్పంచ్‌లు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏర్గట్ల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు కొలిపాక ఉపేందర్ రెడ్డి, ప్రవీణ్ యాదవ్, కౌడా భూమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.



# రబీ ధాన్యం కొనుగోలుకు పక్కా కార్యాచరణ సిద్ధం

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

జిల్లాలో రబీ ధాన్యం కొనుగో లుకు పక్కా కార్యాచరణ సిద్ధం చేసి, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రబీ ధాన్యం కొనుగోలు పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ధారిం చామని, ఏప్రిల్ లో కొనుగోలు ప్రారంభించి మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తేమ శాతం వచ్చిన వెంటనే 24 గంటల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొన్ని కొనుగోలు కేంద్రాలు కేటాయించని మిల్లర్లకు ధాన్యం పంపిస్తున్నట్లు గమనించామని, యాసంగి సీజన్‌లో ఇది పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఆకస్మిక వర్షాల నేపథ్యంలో ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన హమాలి కార్మికులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హమాలి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తేమ ధాన్యాన్ని ముందుగా ఎత్తివేయాలని, ఎటువంటి వివక్ష లేకుండా కొనుగోలు జరగాలని స్పష్టం చేశారు. రామగిరి గ్రామ సభలో చిన్న రైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయలేదని వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచు కొని, ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా చిన్న రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని 24 గంటలలోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం కొనుగోలు క కేంద్రాల్లో నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్ని సంచుల సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌ల ద్వారా 24 గంటల్లో 100% ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం లో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ముడ్ పోలీస్ అధికారులు, సిబ్బంది నివాస భవనాల నిర్మాణ పనులను పరిశీలించిన సీపీ.

**నేషనలిస్ట్ వాయిస్, గోదావరిఖని :**

రామగుండం పోలీస్ కమిషనరేట్ సాయుధ బలగాల అధికారుల, సిబ్బంది క్వార్టర్స్ నూతన భవనాల నిర్మాణ పనులు పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో, సీపీ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తిచేసి, ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు ,ఆర్ ఐ లు శేఖర్, రమేష్ ఉన్నారు.





## ఆవాస విద్యాలయాలలో లోపాలపై

# కలెక్టర్ ఆగ్రహం

### -ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీకి ఆదేశం-విద్యా బోధన విధానం శుభ్రత సక్రమంగా లేకుంటే వేటు తప్పదు



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాతకొత్త గూడెంలో ఉన్న సమగ్ర శిక్ష పరిధిలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాస విద్యాలయం, పట్టణ బాలుర ఆవాస విద్యాలయంలను గురువారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏడవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు భోజనం ఆహార నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల ఇంగ్లీష్ పఠన సామర్థ్యాన్ని పరీక్షించిన కలెక్టర్ విద్యార్థుల ప్రదర్శన పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు సరిగా చదవలేకపోవడానికి గల కారణాలపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించిన కలెక్టర్ బోధనలో లోపాలు ఎందుకు ఉన్నాయో వివరణ కోరారు. పట్టణ స్థాయి పాఠశాల అయినప్పటికీ విద్యార్థుల సామర్థ్యం తక్కువగా ఉండటం ఆందోళనకరమని తెలిపారు. స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన సరుకులు తగినంతగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరఫరాలో లోపాలు ఎందుకు ఉన్నాయో సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత లోపాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించ బోదని హెచ్చరించారు. ఉపాధ్యాయులు సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్ పాఠశాలలోని ఉపాధ్యాయులు సిబ్బంది అందరూ కాంట్రాక్టు పద్ధతిలోనే విధులు నిర్వహిస్తున్నట్లు గమ నించారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల అభ్యాసంపై ప్రభావం పడకుండా బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ పాఠశాలలో వీధి బాలలు రక్షించబడిన బాలలు డ్రాప్ అవుట్ బాలలు చదువుతున్నందున వారికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ అన్నారు. అయితే పర్యవేక్షణలో లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ నేపథ్యంలో సంబంధిత ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలల నిర్వహణ బోధన ప్రమాణాలు విద్యార్థుల సంక్షేమంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపల్ రాంబాయి ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కేసీఆర్ చిత్ర పటానికి వినతి కాదు... హెచ్చరికేనా

### -తూప్రాన్ ప్రజల ఆగ్రహ గర్జన-ఫాం హౌజ్ నుంచి బయటకు వచ్చి ప్రజల కోసం పని చేయండి





**తూప్రాన్, ఏప్రిల్ 9. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్ మండలంలో ప్రజల అసంతృప్తి ఒక్కసారిగా ఆగ్రహ గర్జనగా మారింది. గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అందుబాటులో లేకపోవడంతో, ఆయన చిత్రపటానికే వినతి పత్రం సమర్పించడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. "ఓటు వేసిన పాపానికి...మీ ఫోటోకే వినతి ఇవ్వాల్సి వస్తోంది" అంటూ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సాధారణ వినతి కాదు, ప్రజల సహనానికి చివరి గీతగా భావిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ వినతి పత్రం కేవలం సమస్యల జాబితా కాదు --- ఇది ప్రజల ఆవేదన, ఇది ఆగ్రహ గర్జన, ఇది చివరి హెచ్చరికగా మారుతున్న సంకేతం ఇప్పుడు అధికారుల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాల్సిన సమయం ఆసన్నమైంది...రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ప్రజల ప్రధాన ఆవేదనలు ఈ విధంగా ఉన్నాయి. అభివృద్ధి ఎక్కడ? అసలు మా ఎమ్మెల్యే ఎక్కడ?? గజ్వేల్ నియోజక వర్గంలోనీతూప్రాన్ డివిజన్‌గా ఏర్పడినప్పటి నుంచి అభివృద్ధి కనిపించలేదని ప్రజలు మండిపడుతున్నారు. సీసీ రోడ్లు లేవుడ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నదివిద్యుత్ స్తంభాల కొరత, నిలిచిపోయిన ప్రాజెక్టులుడబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మధ్యలోనే ఆగిపోయాయితూప్రాన్ రింగ్ రోడ్ నిలిచి పోయిందికోర్టు, ప్రభుత్వ భవనాలు మంజూరైనా అమలు కాలేదు. అత్యవసర సేవల లోటుతూప్రాన్‌లో ఫైర్ స్టేషన్ లేదుఅర్బన్ గ్రాంజ లేదు డిగ్రీ కాలేజ్ లేదు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు -- బ్రిడ్జిల దుస్థితి భారీ వర్షాల కారణంగా తూప్రాన్ నుంచి కిష్టాపూర్, అలాగే గుండ్రెడ్డిపల్లి వెళ్లే మార్గాలు దెబ్బతిన్నాయి. చెక్‌డ్యామ్‌ల వద్ద రహదారులు పూర్తిగా నాశనం అవుతున్నాయని, ప్రతి సంవత్సరం ఇదే సమస్య ఎదురవుతోందని ప్రజలు చెబుతున్నారు. వెంటనే శాశ్వత బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్య -- రవాణా పై డిమాండ్లు బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలి రైల్వే బ్రిడ్జి నిర్మాణం అవసరం తూప్రాన్ కు హైటెక్ ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి "ఇతర ప్రాంతాలకు ఇస్తే... తూప్రాన్‌కు ఎందుకు కాదు?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయంగా వేడి పెంచిన నిరసన ఎన్నికల్లో గెలిపించినప్పటికీ ఎమ్మెల్యేను నేరుగా కలిసే అవకాశం లేకపోవడంతో, ఫోటోకే వినతి ఇవ్వాల్సి వచ్చిందని ప్రజలు తీవ్ర విమర్శలు చేశారు. తూప్రాన్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, దీనికి ప్రత్యేక నియోజకవర్గ హోదా ఇవ్వాలని బలంగా డిమాండ్ చేస్తున్నారు.

# రామవరం ప్రాంతానికి యుద్ధ ప్రాతిపదికన మంచి నీళ్లు అందించాలి

### -మిషన్ భగీరథ పట్ల అధికారులు అలసత్వాన్ని వీడాలి

### -పనులను పరిశీలించిన సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాష ప్రతినిధి బృందం

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**



కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో ఉన్న నీటి ఎద్దడి నివారించేందుకు చర్యలు తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మంచినీళ్లు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం రామవరంలోని కిన్నెరసాని భగీరథ పనుల పైప్ లైన్లను నూతన ట్యాంకులను పరిశీలించి ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు 125 కోట్లతో మిషన్ భగీరథ పథకాన్ని మంజూరు చేయించి ప్రజలు మంచినీళ్లకు బాధపడొద్దని కృత నిశ్చయంతో చేసిన పనులకు అధికారుల అలసత్వం ద్వారా పనులు జాప్యం అవుతున్నాయని అన్నారు. తక్షణమే మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి నూతన ట్యాంక్ కి నీళ్లు ఎక్కించి రామవరంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులకు ఫోన్లో ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పాత కిన్నెరసాని ట్యాంక్ ద్వారా నీళ్లు అందించాలని అధికారులకు సూచించినట్లుగా తెలిపారు. అలాగే స్టాండ్ బై మోటార్లను ఏర్పాటు చేసుకొని మంచినీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడకుండా చూసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే పైప్ లైన్ జరుగుతున్న ప్రాంతాల్లో శిథిలమైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆయన ఆదేశించారు. పనులను పరిశీలించిన సిపిఐ ప్రతినిధి బృందంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్య శ్రీనివాస్, రామవరం బ్రాంచ్ కార్యదర్శి మర్రి గోపి, త్రీ టౌన్ టౌన్ ఏరియా కార్యదర్శి యూసుఫ్, 14,16,17వ డివిజన్ కార్పొరేటర్స్ సుధాకర్ రాజు, మునిగడప పద్మ, ఎర్రబెల్లి శంకర్, సీనియర్ నాయకులు మాటేటి గోపాల్, సర్పంచ్ నగేష్, రమేష్, అంకుష్ గంటాడి కోటేశ్వరరావు, ఖంపెల్లి దుర్గయ్య, నాగరాజు, శివ, రాజు, జగ్గు, చందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### -జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**

కొత్తగూడెంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెంలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణ పనులు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి అయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది యంత్ర సామగ్రి ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల పురోగతిపై ప్రతిరోజూ నివేదికలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అత్యుత్తమ సౌకర్యాలతో పాఠశాల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి డాక్టర్ నవ జ్యోతి

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 9(నేషనలిస్ట్ వాయిస్):**

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ నవ జ్యోతి అన్నారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీలో జమాతే ఇస్లామి హింద్ ఆద్వర్యంలో గురువారం నిర్వహించిన "ఈద్ మిలాఫ్" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఇలా మహిళలంతా కలసి ఒకరి పండుగలను సంస్కృతులను మరోకరు పంచుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మరో అతిథి ఉపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడుతూ ప్రతి స్త్రీకి విద్యా జ్ఞానం తప్పనిసరి అని విద్యావంతురాలు అయినా మహిళల వలన సమాజ సంస్కరణ సాద్యం అని అన్నారు. సేవ సమితి సభ్యురాలు సత్యావతి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జమాతే ఇస్లామి హింద్ వైద్య విద్యా వివాహలకు సహాయం చేస్తూ చేస్తున్న సేవలను కొనియాడారు. జమాతే ఇస్లామి హింద్ అద్యక్షురాలు మాట్లాడుతూ మనందరి సృష్టి కర్త అయినా దేవుడు ఒక్కడే అని కలసి మెలసి జీవించడంలోనే దైవానుగ్రం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు పర్వీన్ సుల్తాన్, నస్రా, పర్వీన్ బాను, షేహనాజ్, పర్వీన్, షమీం, ఆశ వర్కు జ్యోతి, అంగన్వాడీ టీచర్లు సరస్వతీ, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు రాధ, రజీయా వార్డు మెంబర్స్ అరీపా తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడుల బలోపేతానికి "బడి బాట"..

**ఏప్రిల్ 9 నేషనలిస్ట్ వాయిస్**

ఏర్గట్ల: వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 'బడి బాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. చదువు మధ్యలోనే మానేసి పనిలో చేరిన విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో చర్చించి తిరిగి పాఠశాలలకు పంపేందుకు చర్యలు చేపడుతున్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సదుపాయాలు, నిర్వహిస్తున్న సాంస్కృతిక, సాహిత్య, శాస్త్రీయ కార్యక్రమాల గురించి వివరించి కరపత్రాలు అందజేశారు. విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌లు, నోటుబుక్స్‌తో పాటు వచ్చే విద్యాసంవత్సరం నుంచి 21 వస్తువులతో కూడిన కిట్ అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం గ్రామ ప్రజలందరి బాధ్యత అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణచారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందాన్ని మూడు భాగాలుగా విభజించి ప్రతిరోజు ఒక బృందం గ్రామంలో పర్యటిస్తూ పాఠశాల పనితీరును తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మునిరుద్దిన్, ప్రవీణ్ శర్మ, రాజేందర్, ట్వింకిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పోచమ్మ కొలుపు.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 9.**

కమాన్ పూర్ మండలం నాగారం, రేపల్లె వాడ గ్రామాల్లో గురువారం పోచమ్మ కొలుపు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత నాలుగు రోజులుగా శ్రీదేవి , భూదేవి,సహిత బొడ్రాయి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. దీని అనంతరం పోచమ్మ కొలుపులో భాగంగా బుధవారం రాత్రి పంబాల పూజారులతో కలిసి గ్రామస్తులు పొలిమేర పసుపు బియ్యం చల్లుతూ పొలిమేర కట్టడి చేశారు. అనంతరం పోచమ్మ తల్లి, భూదేవి, పాపనాసిని, వంటి ప్రతిమలను గ్రామపంచాయతీ ముందు పెట్టి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అనంతరం బలి కార్యక్రమాన్ని పంబాల పూజారులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తమ తమ బంధువులు వచ్చి పోచమ్మ కలుపు ఉత్సవాల్లో పాల్గొన్నారు. అలాగే గత ఐదు రోజులుగా కొనసాగుతున్న బొడ్రాయి మరియు పోచమ్మ కొలుపు ఉత్సవాలు ముగిశాయి. నాగారం రేపల్లెవాడ గ్రామాల్లో ఐదు రోజులపాటు పండుగ వాతావరణం నెలకొంది. దీంతో పోచమ్మ కలుపుతూ ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.





# దామోదర్ రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణకు హాజరైన వొడితల ప్రణవ్...

- దామోదర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం.
- హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహన్ని ఏర్పాటు చేస్తాం.
- అనేక మంది కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దిన గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుడు.
- హుజూరాబాద్,పాత కమలాపూర్ నుండి భారీగా తరలివచ్చిన అభిమానులు.
- జోహార్ దామన్న నినాదాలతో మారుమ్రోగిన సభా ప్రాంగణం.

**హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 09(నేషనలిస్ట్ వాయిస్):**

రాజకీయాల్లో ప్రజల అవసరాల కోసం పనిచేసి కరీంనగర్ జిల్లా టైగర్ గా,నమ్మకానికి,విశ్వసనీయతకు మారు పేరు తెచ్చుకున్న మహా నాయకుడు ముద్దసాని దామోదర్ రెడ్డి అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.గురువారం రోజున కరీంనగర్ పట్టణ శివారులోని సదాశివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ విజయ రమణారావు ఆధ్వర్యంలో ఆయన 14వ వర్ధంతి సందర్భంగా కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ముద్దసాని దామోదర్ రెడ్డి గురించి జిల్లాలో తెలియని వ్యక్తి లేడంటే అతిశయోక్తి కాదని,వ్యక్తిగతంగా మా కుటుంబానికి,మా తాత వొడితల రాజేశ్వర్ రావు కు చాలా దగ్గరి వ్యక్తి అని,వారి నుండి మాలాంటి యువతర నాయకులం నేర్చుకోవాల్సింది చాలా ఉందని,వారి ఆశయాలకు అణుగుణంగా ప్రజా జీవితంలో పనిచేస్తామని, హుజూరాబాద్ నియోజకవర్గంలో దామోదర్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రణవ్ తెలిపారు.విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో పెద్దపల్లి శాసన సభ్యుడు విజయ రమణారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే కాదు రాష్ట్ర స్థాయిలో దామోదర్ రెడ్డికి అభిమానులు ఉండేవారని,వారి తర్వాత ఆ ప్రాంతానికి నాయకత్వం వహించే నాయకుడిగా వచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ,కరీంనగర్ శాసన సభ్యులు గంగుల కమలాకర్, కరీంనగర్ మేయర్ శ్రీనివాస్,సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు మల్లేష్,దామోదర్ రెడ్డి అభిమానులు భారీగా పాల్గొన్నారు.






# అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు బీఎస్పీ శంఖారావం

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న హనుమకొండ లోని కేడీసీ గ్రౌండ్‌లో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షులు ఇరుకుల్ల రాజనరసయ్య వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈ సభకు సంబంధించిన గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. అ నంతరం ఇరుకుల్ల రాజనరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ జోన్ ఇంచార్జి వరికిల్ల మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సభకు జిల్లాలోని మూడు నియోజక వర్గాల నుండి పార్టీ నాయకు లు, కార్యకర్తలు,అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నార్ల గోపాల్ యాదవ్, సీనియర్ నాయకు లు పెగ నరేష్, కాదాసి రవీందర్, మంథని నియోజకవర్గ ఇంచార్జ్ జనగామ రవికుమార్, పెద్దపల్లి నియోజకవర్గ కోశాధికారి మల్లారపు రవీందర్, రామగుండం నియోజకవర్గ ఇంచార్జి జింక ఉదయ్, అధ్యక్షులు జనగామ లింగయ్య,ఎల్ల స్వామి, కార్పొరేషన్ అధ్యక్షులు బివిఎఫ్ విష్ణు,నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నేషనలిస్ట్ వాయిస్, మంచిర్యాల :**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్ బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్ రవాణా జాతీయ రహదారులు రోడ్లు భవనాలు ఆర్.టి.సి., విద్యుత్ పంచాయతీ రాజ్ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త ఆటంకాలను వెంటనే తొలగించాలని ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్ లైటింగ్ జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన ఓవర్ లోడెడ్ వాహనాలు పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని రహదారులపై కేజ్ వీల్స్ ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు హెచ్చరిక బోర్డులు జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రతి మండల గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని వారి వివరాలు పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్ మితిమీరిన వేగం డ్రంక్ అండ్ డ్రైవింగ్ రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డి.సి.పి. మాట్లాడుతూ జిల్లాలో హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని రహదారి ప్రమాదాలు మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కొక్కరకుంట అంగన్వాడి సెంటర్ లో అన్న ప్రసన్న కార్యక్రమం :

**రామడుగు:నేషనలిస్ట్ వాయిస్:**

రామడుగు మండలం కొక్కరకుంట అంగన్వాడి సెంటర్లో పోషణ పక్షంలో గర్భవతులకు పాలిచ్చే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి గురువారం అవగాహన కల్పించారు. (టిఎంఆర్) పంపిణీ ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్ పంపిణి చేశారు. అనంతరం పిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాడీ శారద ఉపసర్పంచ్ వేముండ్ల కుమార్ (ఐసిడిఎస్ సిడిపిఓ) నర్సింగారాణి సూపర్వైజర్ రేణుక వార్డు సభ్యులు పిల్లల తల్లులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాలలో ఘనంగా జాబ్ మేళా






**కరీంనగర్ ఏప్రిల్ 09(నేషనలిస్ట్ వాయిస్)**

కరీంనగర్‌లోని ఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ (టాక్) ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ జాబ్ మేళాలో కళాశాల వివిధ విభాగాలకు చెందిన సుమారు 460 మంది విద్యార్థిని, విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల చురుకుదనం, ఆసక్తి ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్, అకాడమిక్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి రాజయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హరిజోత్ కౌర్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సతీష్ కుమార్, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ కే. సుధాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ నితిన్ పాఠక్ మాట్లాడుతూ, విద్యార్థులు జాబ్ మేళా అవకాశాలను సద్వినియోగం చేసుకుని డిగ్రీ అనంతరం స్థిరమైన ఉద్యోగాలను సాధించాలన్నారు. అకాడమిక్ కోఆర్డినేటర్ తాళ్లపల్లి రాజయ్య మాట్లాడుతూ, కళాశాలలో చదువుతూనే ఉద్యోగ అవకాశాలను అందించే వేదికగా జాబ్ మేళాలు మారుతున్నాయని తెలిపారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హరిజోత్ కౌర్ మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో త్వరగా స్థిరపడవచ్చని పేర్కొన్నారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సతీష్ కుమార్ ఈ జాబ్ మేళాలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం ఆనందదాయకమని అభిప్రాయపడ్డారు. ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ కే. సుధాకర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని కంపెనీలు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యాపక బృందం, టీఎస్‌కేసీ ప్లేస్మెంట్ సెల్, మెరీనా పెయింట్స్ యాజమాన్యం పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.

# సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నేషనలిస్ట్ వాయిస్, మంచిర్యాల :**

సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్ జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ లతో కలిసి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎల్.పి.జి. సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పైప్‌లైన్ సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని అనుమతుల ప్రక్రియను సరళీకరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులకు సంబంధించిన అనుమతులను 24 గంటలలో మంజూరు చేసే విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని ఆలస్యం అయితే డీమ్డ్ పర్మిషన్ గా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు సంబంధించిన రెంటల్ లీజ్ ఛార్జీలను తాత్కాలికంగా మాఫీ చేయడం జరిగిందని పనుల వేగవంతానికి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలకు 24 గంటల పని సమయం శబ్ద కాలుష్యం నిబంధనలను పాటించేలా అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పి.ఎన్.జి. ఎల్.పి.జి. మధ్య సమన్వయాన్ని పౌరసరఫరాల శాఖ సమర్థవంతంగా నిర్వహించాలని అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని ప్రజలకు నిరంతర ఇంధన సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసరావు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నేషనలిస్ట్ వాయిస్, మంచిర్యాల :**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండలం సీతారాంపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు, మూత్రశాలలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. పాఠశాలలో ఏమైనా మరమ్మతులు ఉన్నట్లయితే వెంటనే పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, వేసవి అయినందున ఆరోగ్యం దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సబ్ జైల్ లో ఖైదీలకు రక్త పరీక్షలు.

**హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 09(నేషనలిస్ట్ వాయిస్)**

హుజురాబాద్ లోని సబ్ జైల్ లో ఖైదీలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం ఖైదీలకు HIV, SYPHLIS, Hepatitis B , RBS పరీక్షలు చేసినట్లుఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఐతీ. నారాయణ రెడ్డి తెలిపారు. అలాగే కంటి పరీక్షలు కూడా చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీ ఎం ఎచ్ ఓ శ్రావణ్ కుమార్, వైద్యులు ప్రసాద్ రావు, తులసీదాసు, జరీన్, ICTC COUNCELLOR సుజాత, ల్యాబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# డ్రైన్ ఎండ్ సోక్ ఫిట్ లోకి మురికి నీరు విడుదల

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 9.**

రామగిరి మండలం రత్నాపూర్ పరిధి రాంనగర్ లోని డ్రైన్ ఎండ్ సోక్ ఫిట్ లోకి గురువారం మురికి నీరు విడుదల చేశారు. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు ఆధ్వర్యం లో సోక్ ఫిట్ నిర్మాణం జరిగింది. మురికి నీరు తో ఇబ్బంది అవుతుందని స్థానికుల ఫిర్యాద్ మేరకు సోక్ ఫిట్ నిర్మాణం చేశారు. మురికి కాలువలో భారీగా ఆగిన మురికి నీరు సోక్ ఫిట్ లోకి చేరడం తో తాత్కాలికంగా ఇబ్బందులు తగ్గుతాయని సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నం మణి తేజ, సెక్రటరీ గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి కూలీల చే వేసవి లో జాగ్రత్తగా పని చేయించండి

## ఏ.పి.డి. కొమ్మెర సత్యనారాయణ

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 9.**

ఉపాధి కూలీల చే వేసవి లో జాగ్రత్త గా పని చేయించాలని ఉపాధి హామీ పథకం ఏ.పీ.డీ కొమ్మెర సత్యనారాయణ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో రామగిరి ఖిల్లా లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఎండ వేడిమి తగలకుండా ఉదయం 7 గంటల నుండి 11 గంటల లోపు పనులు పూర్తి చేయించాలని, రెండు సార్లు ఎన్.ఎం.ఎం.ఎస్ లో ఆన్ లైన్ ఫోటో దిగాలని కోరారు. రూ. 272 కూలీని రూ. 307 కు పెంచడం జరిగిందని తెలిపారు. 40 మంది కూలీలకు ఒక్క మేట్ ను నియమిస్తామని తెలిపారు. వేసవి తాపం నుండి ఉపశమనం కొరకు షెడ్ నెట్ తో గుడిసెలు వేయాలని, చల్లటి నీరు, మజ్జిగ సరఫరా చేయించాలని సూచించారు. ఓ.ఎస్.ఆర్. పాకెట్ లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వి.బి.జి. రాం జి పథకం గా పేరు నెల రోజుల లో మారుతుందని తెలిపారు. దీనికి అనుకూలం గా పని చేయవలసి ఉంటుందని తెలిపారు. జిల్లా లో 3 లక్షల మంది వరకు ఉపాధి కూలీలు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. ఐరిస్, ఈకేవైసి ఇబ్బందులు వచ్చిన కూలి లతో మాట్లాడి వాటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీడీని సర్పంచ్ పల్లె ప్రతిమపీవీ రావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, టెక్నికల్ అసిస్టెంట్ లు మల్కా అఖిల, లింగాల సుప్రియ, సెక్రటరీ గంగుల సంతోష్, డి.ఆర్.పి అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ లు సందేవేన జ్యోతికుమార్ పాల్గొన్నారు.




# కూకట్పల్లి ప్రభుత్వ నూతన డిగ్రీ కళాశాల అభివృద్ధికి మరింత ఊపిరి : ఎమ్మెల్యే మాధవరం

## కొత్త భవనం ప్రారంభం, భూమి కేటాయింపుపై ఎమ్మెల్యే కృష్ణారావు విజ్ఞప్తి

**కూకట్పల్లి, నేషనలిస్ట్ వాయిస్ :**

పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో గతంలో పోరాడి కూకట్పల్లికి ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను తీసుకువచ్చామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కళాశాల మంజూరు అయినప్పటికీ మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడిన సమయంలో, ఒక సంవత్సర కాలం పాటు సొంత నిధులతో బెంచీలు, ఇతర అవసరాలను సమకూర్చినట్లు వెల్లడించారు. ఆనాటి ముందుచూపుతో ఏర్పాటైన ఈ కళాశాల నేడు తెలంగాణలో అగ్రగామి డిగ్రీ కళాశాలగా ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం జూనియర్, డిగ్రీ కళాశాలలు ఒకే ప్రాంగణంలో కొనసాగుతుండటంతో స్థలాభావం కారణంగా విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కూకట్పల్లి హుడా ట్రక్ పార్క్ ప్రాంతం, కేపీహెచ్‌బీ, బాలనగర్ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో నాలుగు ఎకరాలను డిగ్రీ లేదా జూనియర్ కళాశాలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిధుల కొరత ఉంటే సిఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. భూమి కేటాయింపులో జిల్లా కలెక్టర్ మనూ చౌదరి, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కూకట్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, కళాశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనూ చౌదరి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ, ప్రైవేట్ సంస్థలతో పోటీగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూకట్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని అభినందించారు.




# దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించిన యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్:

**రామడుగు:నేషనలిస్ట్ వాయిస్:**

రామడుగు మండలంలోని దివ్యాంగులకు ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ వారు దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థిక స్వావలంబన చేకూర్చే లక్ష్యంతో పనిచేస్తోంది. ఫౌండేషన్ శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సులలో శిక్షణ పొందిన దివ్యాంగులకు కుట్టు మిషన్లు జిరాక్స్ మిషన్లు ఎలక్ట్రిషియన్ ప్లంబింగ్ కిట్లను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ మాగాని రాజమౌళి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో దివ్యాంగులకు ఉచితంగా కిట్లను పంపిణీ చేశామని వారు తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ అందించి స్వయం ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల ఇంచార్జ్లు మోరే కృష్ణ దొడ్డే రాజు రామడుగు ట్రైనర్లు కొమ్మెర మాధవ రెడ్డి శ్రీరామ్ ప్రసన్న కోఆర్డినేటర్ సంపత్ కుమార్ దివ్యాంగులు పాల్గొన్నారు.






# 12న మెగా మాక్ టెస్ట్ నిర్వహణ

## - ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

యువత మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ పోలీస్ ఉద్యోగాల సాధనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లా కలెక్టరేట్‌లో “పెద్దపల్లి యువశక్తి ప్రోగ్రామ్” లో భాగంగా నిర్వహించనున్న మెగా మాక్ టెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా యువత పోలీస్ విభాగంలో ఎస్ ఐ /కానిస్టేబుల్ , ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు సన్నద్ధం కావడానికి ఈ మెగా మాక్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పోలీస్ నియామక పరీక్షల విధానంలోనే రాత పరీక్ష నిర్వహించడంతో పాటు అభ్యర్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించే విధంగా ఫిజికల్ ఈవెంట్స్ కూడా నిర్వహించబడతాయ ని తెలిపారు. ఈ మెగా మాక్ టెస్ట్ ఈ నెల 12వ తేదీ ఆదివారం రోజున జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం, సీఈఆర్ క్లబ్, గోదావరిఖనిలో ఉదయం 6:00 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా లో పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రాత పరీక్షలో 1వ బహుమతి రూ.10,000, 2వ బహుమతి రూ.5,000, 3వ బహుమతి రూ.2,000, 4వ బహుమతి రూ.1,000 ఇవ్వబడుతాయ ని తెలిపారు. అలాగే ఫిజికల్ ఈవెంట్స్‌లో కూడా అదే విధంగా బహుమతులు అందజేయబడతాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈ నెల 10వ తేదీగా నిర్ణయించబడినదని, అభ్యర్థులు క్యూ ఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9949725997, 9573688952, 8333044460 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లావ్యాప్తంగా యువత ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ప్రతిభను నిరూపించుకొని పోలీస్ ఉద్యోగాల సాధనలో ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, లెంకల మహిపాల్ రెడ్డి (ఎక్స్ ఆర్మీ), యంగ్ ఇండియా మిషన్ సభ్యురాలు శ్వేత రెడ్డి, సిరిప్రియా దర్శిని తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలి






### -మంథని మున్సిపల్ చైర్ పర్సన్ ఓడ్నాల శ్రీనివాస్

### -ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే వేడుకలు

**మంథని ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్, ఎప్రిల్**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. గురువారం మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడా, సాంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంథని మున్సిపల్ చైర్ పర్సన్ ఓడ్నాల శ్రీనివాస్ హాజరయ్యి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికై తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అంద జేస్తామని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డా. జై కిషన్ ఓజా అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యలు అభ్యసిస్తూ తాము, తమ సమాజానికి ఉన్నత విలువలు అందజేయాలని తమ జూనియర్స్ కు ఆదర్శప్రాయంగా నిలవాలని సూచించారు. తదనంతరం క్రీడలలో రాణించిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. తర్వాత జరిగిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ముస్కుల సహేందర్ రెడ్డి, మల్లేపల్లి సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ, కళాశాల సీపీడీసీ సెక్రటరీ మాదాడి ప్రభాకర్ రెడ్డి, పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షుడు కొండేల మారుతి, వైస్ ప్రిన్సిపల్ పరిషయ్య, ఐక్యుఏసి కోఆర్డినేటర్ కృష్ణ , ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి డా. లక్ష్మీ నారాయణ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇన్చార్జి సతీష్ అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, ఫర్జానా, మానస, రజిత, దుర్గం కృష్ణ, శేఖర్, శ్రీధర్ బోధనేతర సిబ్బంది సుధాకర్, ముజాహిద్,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమ్మెకు సీఐటీయూ మద్దతు

**పెద్దపల్లి ప్రతినిధి, నేషనలిస్ట్ వాయిస్:**

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీవీఏఈజేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు సీఐటీయూ పూర్తి మద్దతు ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిజన్ కార్మికులు సమ్మె చేపట్టారు. పెద్దపల్లి సర్కిల్ కార్యాలయం ముందు జరుగుతున్న సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి. జ్యోతి, సీపెల్లి రవీందర్ శుక్రవారం హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్ల నిరవధిక సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికుల పట్ల ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నా రు. వరంగల్ ఎన్పీడీసీఎల్ ముందు వేలాది మందితో మహాధర్నా చేసినా స్పందించ కపోవడం ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శన మన్నారు. ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చేస్తూ వివక్ష చూపడం దారుణమ న్నారు. అర్హత కలిగిన కార్మికులకు వెంటనే కన్వర్షన్ ఇవ్వాలని, అన్ మాన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీఓ 11 ప్రకారం పీస్ రేట్, స్పాట్ బిల్లింగ్ కార్మికుల కు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికుల న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు సీఐటీయూ అండగా ఉంటుందని, అవసరమైతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి, ఎల్లయ్య, నర్సయ్య, నరేష్, కొండయ్య, జడలు సత్యనారాయణ, కాళీం, మాంకాళి రాజు, చిన్నయ్య, రమేష్, జగన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీలకు స్మార్ట్ సేవలు





### - టీచర్లు, హెల్పర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ

### - 17 మంది దివ్యాంగులకు మోటరైజ్డ్ వాహనాల అందజేత

### - ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి

**కరీంనగర్ ఏప్రిల్ 09(నేషనలిస్ట్ వాయిస్)**

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరిచి, డిజిటల్ సేవలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్య తనిస్తోందని ఎమ్మెల్యే గంగుల కమ లాకర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు



స్మార్ట్‌ఫోన్లు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సేవలు మరింత పారద ర్శకంగా సాగేందుకు సాంకేతికతను జోడించామన్నారు. కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు రూ. 11,650 విలువైన శాంసంగ్ మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. 4 జీబి, 64 జీబి మెమరీ ఫీచర్లు ఉన్న ఈ ఫోన్ల ద్వారా పిల్లల సమాచారం, గర్భిణులు, బాలింతల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లా డుతూ.. బాల్యం భద్రంగా ఉన్నప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుందని, పోషణ అభియాన్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఇటీవల నగరంలోని 35 కేంద్రాలకు వసతి సౌకర్యాల నిమిత్తం రూ. 35 లక్షలు విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అంగన్‌వాడీలు వారధులుగా ఉండి క్షేత్రస్థాయిలో సేవలు అందిం చాలన్నారు. ఇదే క్రమంలో 17 మంది దివ్యాంగులకు స్వయం ఉపాధి, ప్రయాణ సౌకర్యం కోసం రిట్రోఫిట్టెడ్ మోటార్ వాహనాలను అందజేశారు. అనంతరం 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన గ్రోత్ డ్రైవ్‌లో ఆరోగ్యంగా ఉన్న పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ నెల 9 నుంచి 23 వరకు జరిగే 'పోషణ పక్షం' కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ?ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి సరస్వతి, సీడీపీఓ సబిత, డీఎంహెచ్ఓ వెంకటరమణ, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ బీసీ, అంగన్‌వాడీ టీచర్లు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# చేతి బోరు మరమ్మతులు చేపించిన సర్పంచ్

## బోరుకు మరమ్మతు చేయించిన సర్పంచ్.

**కమాన్ పూర్ నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 8. కమాన్ పూర్**

పెంచికల్ పేట్ గ్రామంలోని 7వ వార్డులో ఉన్న చేతి బోర్ మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, వెంటనే స్పందించిన సర్పంచ్ ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తమ ప్రాధాన్యత అని తెలిపారు. చెడిపోయిన చేతి బోర్‌ను మరమ్మత్తు చేయించడం ద్వారా స్థానికులకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం కలిగిందన్నారు. వార్డు ప్రజలు ఈ చర్యపై సంతోషం వ్యక్తం చేస్తూ, తక్షణ చర్యలు తీసుకున్న సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె నారాయణ, మాజీ సర్పంచ్ కొండ వెంకటేష్, వార్డు సభ్యులు చిమ్మనవేన దేవిక-మల్లేష్ మరియు స్థానికులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలి





### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్.

**జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 09 :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాడల్ స్కూల్ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను నేర్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసు కున్నారు. విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాల తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్ లో చదువు తున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. క్లాస్ రూమ్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ ఆరా తీశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటి స్తున్నారా లేదా అని హాజరు పట్టికను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిం చాలని, సర్కారు బడుల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, భావి తరాలకు అవసరమైన విద్యా బోధన చేయడం జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వంద శాతం ప్రగతి సాధించే విధంగా విద్యా బోధనకు కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణ, పరిసరాల పారిశుద్ధ్య సౌక ర్యాలు వంటి అంశాలను పరిశీలిం చారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశిం చిన మెనూ ప్రకారం భోజనం అందు తున్నదా అనే విషయాన్ని ఉపాధ్యా యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, భోజన తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటిం చాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల తరగతి గదులలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యా యులకు ఆదేశించారు. తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి, శానిటేషన్ చేయించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలను, కిచెన్ షెడ్ లను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటిం చాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.రాము, డిఆర్డిఓ పీడీ రఘువరన్, తహసిల్దార్ , ఎంపి డిఓ, గ్రామ సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు,

# భద్రాచలం ఆర్టిఏ కార్యాలయం కొత్త స్థలానికి మార్పు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి (నేషనలిస్ట్ వాయిస్) ఏప్రిల్ :09**

భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలోని రవాణా శాఖ యూనిట్ కార్యాలయం ( ఆర్టిఏ యూనిట్ ఆఫీస్ ) కొత్త ప్రాంగణానికి మారింది. ఇప్పటివరకు కూనవరం రోడ్‌లో కొనసాగుతున్న ఈ కార్యాలయం గురువారం నుండి ఐటిడిఏ కాంప్లెక్స్‌లోని జీవకా బ్లాక్, మొదటి అంతస్తుకు (మొబైల్ కోర్టు పక్కన) మార్చబడింది. వాహనాలకు సంబంధించిన లెర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ మరియు ఇతర సేవల కోసం ప్రజలు ఇకపై కొత్త కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ మార్పును ప్రజలు గమనించి సహకరించాలని మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య విజ్ఞప్తి చేశారు.



# బహదూర్‌పల్లి స్క్రాప్ గోదాంలో అగ్నిప్రమాదం

## సకాలంలో మంటలు ఆర్పడంతో తప్పిన ముప్పు

**మేడ్చెల్,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**

మేడ్చల్ జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దుండిగల్ పరిధి బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలోని డెకరేషన్ స్క్రాప్ గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసిన వాహనాలకు కూడా మంటలు అంటుకున్నాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా కాలనీలో దట్టమైన పొగ వ్యాపించింది. ఎగిసిపడుతున్న మంటలు, కమ్మేసిన పొగతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేసేందుకు యత్నిస్తున్నారు. మరోవైపు జీడిమెట్ల పారిశ్రామిక వాడలోనూ భారీ అగ్నిప్రమాదం జరిగింది. ÷ర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోవాలి

## పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన పల్లా

**జనగామ,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్)**

: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం జనగామ మండలంలోని పెంబర్తి, వడ్లకొండ, ఎర్ర గొల్ల పహాడ్, అడవి కేశవాపురం గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం అమ్మకాలలో సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని మిల్లర్లు ఇబ్బందులు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ధాన్యం అమ్మిన తర్వాత చెల్లింపులు ఆలస్యమైతే త్వరగా జమ చేయిస్తానని , ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ధాన్యం అమ్మకాలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాత బకాయిలు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రెండున్నరేళ్లుగా రైతుల సమస్యలను నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళు తున్నామని వెల్లడించారు. మిల్లర్లు ఇబ్బందులు పెడితే కచ్చితంగా వారితో మాట్లాడి పరిష్కరి స్తానని స్పష్టం చేసారు. జనగామ నియోజకవర్గంలోని ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతగా తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సర్పంచులు చిన్నబోయిన రేఖ, కాయిదాపురం మహేందర్ రెడ్డి, చిర్ర సత్యనారాయణరెడ్డి, భూ రెడ్డి చైతన్య ప్రమోద్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దే సిద్ధి లింగం, నాయకులు బైరగోని యాదగిరి గౌడ్, చంద్రం గౌడ్, సీఈవో భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ చిర శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న భూ కబ్జాదారులు

## పాఠశాల కాంపౌండ్ వాల్ కూల్చివేత దుర్మార్గం

## చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపి రఘునందన్ వినతి

**సంగారెడ్డి,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**

కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తున్నారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. వారి కబ్జాలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వారే కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. సర్వే నంబర్ 428లో 2 ఎకరాల 18 గుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ రహదారుల విస్తరణ ప్రజాసంక్షేమం కోసం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పుకొచ్చారు. కబ్జాదారులకు, జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను రాత్రికి రాత్రి కూలగొట్టడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల కాంపౌండ్ వాల్ బయటనే జాతీయ రహదారి విస్తరణ చేయాల్సి ఉండగా .. పాఠశాల తరగతి గదులను కూల్చివేయటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఈ విషయమై స్పందించి పాఠశాల గదులను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల కూల్చివేతలపై అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

# ఆరు గ్యారెంటీలకు దిక్కేది

## రైతుల...అంగన్‌వాడీల సమస్యలు పట్టవా

## మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

**హన్మకొండ,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్)**

:రైతుల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అని నమ్మించి.. ఇప్పటివరకు ఏ ఒక్క హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని తెలిపారు. కేసీఆర్ పాలనలో వ్యయసాయం పండగలా ఉండేదని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వేళల్లో రైతులకు అండగా ఉండేదని తెలిపారు. కేసీఆర్ పాలనలో విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసి వ్యవయానికి 24 గంటల కరెంట్ ఇచ్చామని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలుచేయలేదని విమర్శించారు. అంగన్‌వాడీలు రోజూ రో÷-డడెక్కి పోరాడుతున్నారని తెలిపారు. ఆశావర్కర్లది కూడా అదే పరిస్థితి అని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలను తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నెరవేర్చారని తెలిపారు. రూ.4వేలు ఉన్న జీతాన్ని రూ.7వేలకు పెంచారని గుర్తుచేశారు. మళ్లీ జీతం సరిపోవడం లేదంటే రూ.10,500కు పెంచారని అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వానిది, తెలంగాణ ఉద్యోగులది పేగుబంధంలా ఉండేదని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగులకు జీతాలు పెంచామని తెలిపారు. నిరసనలు తెలపక ముందే వారి సమస్యలు పరిష్కరించామని పేర్కొన్నారు.

# వైఎస్ మరణం వేళ ..సిఎం పదవి కోసం ఎత్తులు

## ఆనాడు సంతకాల సేకరణలో జగన్ బిజీ

## బొత్స కూడా వైఎస్ మృతిపై అనుమానించారు

## ఒక్క అవకాశం అంటూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు

## జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సమయంలో జగన్ ఎక్కడ ఉన్నారో చెప్పాలని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు వైఎస్ ఆచూకీ తెలియక అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం పాకులాడుతారా? అని ప్రశ్నించారు. ఏం జరిగిందో నిర్ధరణ కాక ముందే సీఎం పదవి కోసం సంతకాల సేకరణ చేస్తారా? అని విమర్శించారు. అప్పుడు రిలయన్స్ ఏజెన్సీలపై దాడి చేయించారు. మళ్లీ అదే రిలయన్స్‌ను మంచి చేసుకుని రాజ్యసభ స్థానాలిచ్చారు. చాలామంది సీనియర్ నాయకులు అనేక రకాలుగా మాట్లాడారు. వైఎస్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని సాక్షాత్తూ బొత్సనే మాట్లాడారు. సభ్య సమాజంలో ఎవరూ ఇలాంటి పనులు చేయరని అనుకున్నాం. ఒక సైకోకు పదవీ వ్యామోహం వస్తే.. ఆ పదవి కోసం ఏమైనా చేస్తారు. తండ్రి మరణాన్ని సానుభూతిగా మలచుకుని ఎలా ప్రవర్తించారో చూశాం. తండ్రి మరణం నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు ఎలా సేకరించారో చూశాం అని అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంపై జగన్‌కు ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. ఎన్డీఏపై అచంచల విశ్వాసంతో ప్రజలు అధికారం ఇచ్చారని తెలిపారు. 22 నెలల్లోనే కేంద్రం సాయంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని చెప్పారు. 2004లో రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యారని... నాడు వారి ఆర్థిక పరిస్థితి ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌ను జగన్ మానసిక క్షోభకు



గురిచేసినట్లు చెప్పారు. వైఎస్ చనిపోయినప్పుడు జగన్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. 'వైఎస్సార్ ఆచూకీపై అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం జగన్ పాకులాడతారా? ఏం జరిగిందో నిర్ధారణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు సేకరిస్తారా? ఇతర రాష్ట్రాల్లో జగన్ ఉండాల్సిన అవసరం ఏంటి?' అంటూ మంత్రి ప్రశ్నల వర్షం కురిపించారు. బాబాయిని కిరాతకంగా చంపింది జగన్ కాదా అని మంత్రి నిలదీశారు. తల్లి, చెల్లిని రోడ్డున పడేసిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. పదవి గురించి తప్ప.. జగన్‌కు మరో ఆలోచన లేదని విమర్శించారు. వైఎస్ మృతిలోనూ జగన్ పాత్ర ఉందన్న అనుమానాలున్నాయని తెలిపారు. సైకోకు పదవి ఇస్తే ఎలా ఉంటుందో జగన్ పాలన చూస్తే తెలుస్తుందన్నారు. వైఎస్సార్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని బొత్స సత్యనారాయణనే మాట్లాడారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# వైఎస్ గురించి ఎందుకు మాట్లాడుతారు

## అమరావతి గురించి మాట్లాడుకోండి

## అచ్చన్నాయుడు వ్యాఖ్యలు అహంకారపూరితం

## మండిపడ్డ మాజీమంత్రి బొత్స సత్యనారాయణ

**విశాఖపట్నం,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**

వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు దిగజారి మాట్లాడుతున్నా రని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు ఖండించ డానికి తాను మీడియా ముందుకు రాలేదన్నారు. ఆయన వ్యాఖ్యలు అహంకార పూరితంగా ఉన్నాయని బొత్స అభివర్ణించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తనకు మధ్య ఎంతో అనుబంధం ఉందని ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ గుర్తు చేసుకున్నారు. గురువారం రాజధాని అమరావతిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ విశాఖపట్నంలో స్పందించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర రెడ్డిని గుర్తు చేసుకుని బొత్స తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీపై గతంలో మీరు ఏమన్నారో మర్చిపోయారా అంటూ అచ్చెన్నాయుడును ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయిన తర్వాత.. తాను, తన భార్య పావురాల గుట్టకు వెళ్లామని పేర్కొన్నారు. కావాలంటే రాజధాని అమరావతిపై మాట్లాడండి.. అంతేకానీ ఏమిటి ఈ మాటలు? అంటూ అచ్చెన్నాయుడిని బొత్స నిలదీశారు. చనిపోయిన వ్యక్తి గురించి ఎందుకు మాట్లాడతారు? అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాలు కోసం ఇంత దిగజారుడా.. ఇదేమి రాజకీయం అంటూ సీఎం చంద్రబాబును బొత్స ప్రశ్నించారు.



చారు. తానెప్పుడూ పదవుల కోసం పాకులాడలేదని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు బాధాకరమన్నారు. వైఎస్ మరణంపై అచ్చెన్నాయుడు దిగజారి విమర్శలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బొత్స భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్‌తో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. తన మంత్రి పదవితో అచ్చెన్న ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. రాజకీయాల్లో గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. జగన్‌పై రాజకీయ విమర్శలు ఎన్నైనా చేయండని.. వైఎస్ఆర్ మరణం ప్రస్తావన తీసుకు రావడం అప్రస్తుతమని తెలిపారు. కావాలంటే పాత వీడియో క్లిప్పింగులు చూసుకోవచ్చన్నారు. మావిగన్ నచ్చకపోతే అమరావతే కావాలని చెప్పండని తెలిపారు.

# సెల్ఫీ పిచ్చి ముగ్గురు యువతుల ప్రాణాలు తీసింది

## జలపాతం వద్ద సెల్ఫీ దిగుతూ ముగ్గురు మృత్యువాత

## మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స

**అల్లూరి,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**

సరదాగా ఫోటోలు, సెల్ఫీలు తీసుకోవాలని యువత పడుతున్న ఆరాటం వారి ప్రాణాల మీదకు తెస్తోంది. సెల్ఫీ మాయలో పడి తమ వైపు పొంచి ఉన్న ముప్పును తెలుసుకోలేక అనేక మంది యువత ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఎన్నో. అల్లూరి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. అనంతగిరి మండలం మూలగుమ్మిలో సెల్ఫీ దిగుతూ నలుగురు బాలికలు జలపాతంలో పడిపోయారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో బాలిక అంజలి పరిస్థితి విషమంగా ఉంది. బాలికను అనంతగిరి మండలం లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. మృతులు త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16)ను హుకుంపేట మండలం జుంబువలస వాసులుగా స్థానికులు గుర్తించారు. ఇటీవలే వీరంతా ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. సెల్ఫీ పిచ్చి వీరిని ప్రమాదంలోకి నెట్టేసింది. తాజాగా అల్లూరి జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. సెల్ఫీ సరదా ముగ్గురు యువతుల ప్రాణాలను బలిగొంది. అనంతగిరి మండలం వాలాసి పంచాయతీ మల్లంగుమి గ్రామ సమీపంలో ఉన్న జలపాతం వద్ద నలుగురు యువతులు సరదాగా సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఇంతలోనే ప్రమాద వశాత్తు జలపాతంలో పడిపోయారు. వారిలో ముగ్గురు అమ్మాయిలు మృతి చెందగా... మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురమ్మాయిలు జలపాతం సమీపంలో నిలిచి ఉండగా.. మరొక అమ్మాయి సెల్ఫీ తీస్తుండగా ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నలుగురు అమ్మాయిలను రక్షించేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ముగ్గురు యువతులు మరణించారు. ఓ యువతిని రక్షించి ఆస్పత్రికి తరలించగా.. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులు బూర్జ పంచాయతీ జంబు వలస గ్రామానికి చెందిన త్రిష, పవిత్ర, రత్నకుమారిగా గుర్తించారు. అంజలి అనే మరో యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. యువతుల మృతితో జంబు వలస గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మావిగన్ పేరుతో మరో నాటకం

## ఇది చెబితేనే జనం నవ్వుకుంటున్నారు

## జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత

**ఏలూరు,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):**

మావిగన్' పేరు ఎత్తితే జనం నవ్వుకుంటున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై అక్కసుతో ఇలా చేస్తున్నారని, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి విరుచుకుపడ్డారు. 'గత వైపీపీ హయాంలో కనీసం ఒక ఫైర్ ఇంజన్ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తప్పు చేసిన వారి విషయంలో చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామన్నారు. అవగాహన లేని వాళ్ళు గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించి కోర్టుల నుంచి మొట్టికాయలు వేయించుకున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అలాంటి తప్పులు చేయదలుచుకోలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏదైనా చట్ట ప్రకారం చేయడమే తప్ప ఎక్కడా ఉదాసీనతగా వ్యవహరించదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు. ఉదయం ఏలూరు



చేరుకున్న హోం మంత్రికి ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులు, రెడ్డి అప్పలనాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.2 కోట్ల 72 లక్షలతో నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్ భవనాన్ని అనిత ప్రారంభించారు. ఆపై పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ ప్రతాప్ కిషోర్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలి




## నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్ 09 :

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సూచించారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని స్థంభంపెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను గురువారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మించుకునే ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ పై ధరల నియంత్రణకు ఇండ్ల లబ్ధిదారులకు ధరలు అనుగుణంగా ఉండేలా అధికారులను కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వెనుకబడి ఉన్నట్లయితే వేగవంతం పెంచాలని అధికారులను ఆదేశించారు.గడువులోపు వారికి కేటాయించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భవనాలు ప్రభుత్వం నిర్దేశించిన పరిణామం కలిగి ఉండాలని, లబ్ధిదారులు నిర్మాణాన్ని సకాలంలో నిర్మించుకునేందుకు కావాల్సిన మేస్త్రీలు, కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలని అన్నారు. దశలవారిగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపు నేరుగా ఆధార్ లింక్ చేయబడిన లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలు మార్కింగ్, బెస్మెంట్, స్లాబ్ లెవెల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేసుకోవాలని కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలను అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, అర్హులైన లబ్ధిదారులకు ప్రతి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, తహసీల్దార్, ఎంపిడిఓ, ఎంపిఓ, స్థానిక సర్పంచ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నర్సరీలలోని ప్రతి మొక్కను సంరక్షించాలి




## జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి : నేషనలిస్ట్ వాయిస్ ఏప్రిల్

నర్సరీలలోని ప్రతి మొక్కను సంరక్షించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో, స్తంభంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో పెంచుతున్న మొక్కల స్థితిగతులను, వాటి సంరక్షణ విధానాలను ఆయన స్వయంగా పరిశీలించారు. నర్సరీలలో పెంచుతున్న వివిధ రకాల మొక్కల పెంపకం, వాటి ఎదుగుదలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని మొక్కలు నాటారు, వాటి జీవన శాతం ఎలా ఉంది, భవిష్యత్తులో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం లేకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేసవి కాలం అయినందున ఎండ తీవ్రత దృష్ట్యా నర్సరీలలో షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, సమయం ప్రకారం మొక్కలకు నీరందించాలని, సమయానుకూలంగా ఎరువులు వేసి మొక్కల ఎదుగుదలను సంరక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో 100 మంది ఈజీఎస్ ఉపాధి హామీ కూలీలతో నర్సరీలలోని మొక్కలను పరిరక్షిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలని పూలు, పండ్లు ఇతర నీడ నిచ్చే మొక్కల పెంపకం కీలకమని, నర్సరీలలో నాణ్యమైన మొక్కలను పెంచి సమయానికి నాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటి జీవన శాతాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో పీడీ రఘువరన్, తహసీల్దార్, ఎంపిడిఓ, ఎంపీఓ, స్థానిక సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ కన్నా... కెసిఆర్ పాలనే బెటర్

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకున్న కెసిఆర్

తెలంగాణ ఏర్పాటు కెసిఆర్ వల్లనే సాకారమయ్యింది

జాయతీయ స్థాయిలో బిజెపి..రాష్ట్రంలో కెసిఆర్ బెటర్

కాంగ్రెస్ పాలన చూశాక బిఆర్ఎస్ నయమన్న భావనలో ప్రజలు

మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

జగిత్యాల,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):

రేవంత్ రెడ్డి పాలన కంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... నష్టపోయిన ప్రతి రైతును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదుకుందని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక పోతోందని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ పాలన చూసిన తర్వాత కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని.. రాష్ట్ర స్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇదిలావుంటే 13న జగిత్యాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందని సమాచారం. కేటీఆర్ జగిత్యాలలో జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలోకి అధికారికంగా ఆహ్వానించనున్నారు. జీవన్ రెడ్డి గతంలో కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా, మంత్రిగా పని చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ నుంచి జగిత్యాలకు బయల్దేరారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఆయన నివాసంలో కలవనున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల శివారులో బీఆర్ఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలకున్నాయి. అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి రానున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతో పాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. కాగా, కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్ పార్టీలో చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

# తాత్కాలిక కాల్పుల విరమణ జరిగినా..

## సైనిక బలగాలు ఇరాన్ చుట్టూ కొనసాగుతాయి

## స్పష్టం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తిగా ఒప్పందాన్ని అమలు చేసే వరకు అమెరికా సైనిక బలగాలు అక్కడే కొనసాగుతాయని తెలిపారు. ఇరాన్-అమెరికా మధ్య బుధవారం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు, విమానాలు, సైనికులు, ఆయుధాలు మొదలైనవి ఇరాన్ పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ట్రంప్ పేర్కొన్నారు .యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తి స్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు సైనికులు వెనక్కి రారని ట్రంప్ తెలిపారు. ఒకవేళ ఒప్పందాన్ని ఇరాన్ పాటించకపోతే మునుపెన్నడూ చూడని స్థాయిలో విరుచుకుపడతామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధి మార్గం సురక్షితంగా ఉండాలని, నౌకాయానం నిరంతరం కొనసాగాలని అన్నారు. ఒప్పందం కుదిరేవరకు అమెరికా సైన్యం అక్కడే విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తుందన్నారు. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు భారీగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో కనీసం 254 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. 1,100 మందికి పైగా గాయపడ్డారని సమాచారం. ముఖ్యంగా బీరుట్, దక్షిణ లెబనాన్ ప్రాంతాల్లో నష్టం మరింత తీవ్రంగా ఉందని వార్తలు వస్తున్నాయి.

# పాకిస్థాన్‌పై మాకు నమ్మకం లేదు

## ఇజ్రాయిల్ రాయబారి రూవెన్ అజార్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):

అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు పలికిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఒప్పందంలో మధ్యవర్తిత్వ పాత్ర పోషించిన పాకిస్థాన్‌పై తమకు నమ్మకం లేదని ఆ దేశ రాయబారి పేర్కొన్నారు. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ తాజాగా మాట్లాడుతూ.. శాంతి చర్చల్లో పాక్ పాత్రపై సందేహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఆ దేశాన్ని మధ్యవర్తిగా ఉపయోగించుకోవాలని నిర్ణయించుకుందని తాను భావిస్తున్నట్టు అజార్ పేర్కొన్నారు. ఏదేమైనా ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అమెరికాతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అమెరికా-మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మద్దతు ఇస్తోందన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ఇరాన్ వరకే పరిమితం అని, లెబనాన్‌పై తమ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ రాయబారి వెల్లడించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా తొలగించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నెతన్యాహూకు స్వదేశంలో తీవ్ర వ్యతిరేకత

## కాల్పుల విరమణ ..రాజకీయ వైఫల్యం

## ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శలు

టెలిఅవీవ్,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):

యుద్ధ లక్ష్యాలను సాధించడంలో ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు విఫలమయ్యారని ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్.. కాల్పుల విరమణ ఒప్పందాన్ని, ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఆక్షేపించారు. ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని రాజకీయ వైఫల్యంగా అభివర్ణించారు. యుద్ధ లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు తీవ్రంగా విఫలమయ్యారని, ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ భద్రతకు ప్రమాదకరమని యైర్ లాపిడ్ పేర్కొన్నారు. 'మన చరిత్రలో ఇంతటి రాజకీయ విపత్తు ఎన్నడూ జరగలేదు. అహంకారం, నిర్లక్ష్యం, వ్యూహాత్మక ప్రణాళిక లేకపోవడం వల్ల నెతన్యాహు కలిగించిన రాజకీయ, వ్యూహాత్మక నష్టాన్ని పూడ్చడానికి మనకు సంవత్సరాలు పడుతుంది' అని ట్వీట్ చేశారు. సైన్యం తమకు అప్పగించిన పనులన్నీ పూర్తి చేసిందని, ప్రజలు కూడా అద్భుతమైన స్థైర్యాన్ని ప్రదర్శించారని, అయితే నెతన్యాహు రాజకీయంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విమర్శించారు. తాను నిర్దేశిరచుకున్న లక్ష్యాలలో దేనినీ నెతన్యాహు సాధించలేకపోయారన్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్మూలించడం లేదా తీవ్రంగా దెబ్బతీయడాన్ని నెతన్యాహు యుద్ధానికి ప్రధాన లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్‌కు అస్తిత్వ ముప్పుగా అభివర్ణించారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యాలను నిర్వీర్యం చేయాలని, ఇరాన్ పాలనను బలహీనపరచాలని, దాని మిత్ర బృందాల నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకోవాలని నెతన్యాహు లక్ష్యాలుగా పెట్టుకున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో నెతన్యాహు దారుణంగా విఫలమయ్యారని మాజీ ప్రధాని నాఫ్తాలి బెన్నెట్ విమర్శించారు. 'నాయకత్వం మనకు భ్రమలు కల్పించింది. వారి వాగ్దానాలన్నీ ఈ రాత్రి మన మొహం మీదే పేలిపోయాయి' అని బెన్నెట్ ట్వీట్ చేశారు. ఈ ఒప్పందం రాబోయే సంవత్సరాల పాటు ఇజ్రాయెల్ భద్రతను ప్రమాదంలో పడేసే ఒక సంపూర్ణ వైఫల్యం అని అభివర్ణించారు.

# దేశమంతా అమరావతికి ఓకే ..జగన్ మాత్రం నో

బాపట్ల,ఏప్రిల్9( నేషనలిస్ట్ వాయిస్):

ప్రపంచంలో తెలుగువారంతా గర్వించే నగరం అమరావతి అని ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశంలోని అన్ని పార్టీలు అమరావతినే రాజధానిగా కావాలన్నారని పేర్కొన్నారు. ఒకే ఒక్క వైసీపీ మాత్రం అమరావతిని వ్యతిరేకిస్తోందని ధ్వజమెత్తారు. రాజధాని రైతుల పాదయాత్ర ఈ ప్రాంతం గుండా వెళ్లిందని చెప్పుకొచ్చారు. అప్పుడు రైతులకు తాము మద్దతిచ్చామని అన్నారు. గురువారం బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మంత్రి అనగాని హాజరై మాట్లాడారు. జగన్ హయాంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో గందరగోళం చేశారని ఆగ్రహించారు. జగన్ ఫొటోతో ఉన్న పాస్ పుస్తకాలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. రైతుల భూములను 21ఏ లో చేర్చి ఇబ్బందులకు గురి చేశారని ÷ర్ అయ్యారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని ప్రస్తావించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పాసుపుస్తకాలు ఇస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేశారని ఎద్దేవా చేశారు. రైతులు భూమిని ఆత్మగౌరవంగా భావించారని.. అందుకే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని అన్నారు. తుగ్లక్ పార్టీని మరోసారి అధికారంలోకి రాకుండా జనం చూడాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.

# హారర్ కామెడీతో కొరియన్ కనకరాజు

వరుణ్ తేజ్ కథానాయకుడిగా రానున్న చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితికా నాయక్ కథానాయిక. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్నారు. హారర్ కామెడీ కథకి ఇండియా - కొరియా నేపథ్యాన్ని జోడించి రూపొందిస్తున్న చిత్రమిది. తమన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇస్తూ టీమ్ ఫన్నీ వీడియోను విడుదల చేశారు. ఏప్రిల్ 11న ఈ పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సాంగ్స్ 'ఓజీ' స్థాయిలో ఉండాలని తమన్‌తో వరుణ్‌తేజ్ సరదాగా చెప్పారు.

## పెద్దిలో పాట కోసం నాయికాన్వేషణ

రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాలోని ప్రత్యేకగీతాన్ని త్వరలోనే తెరకెక్కించ నున్నారు. అందుకు సంబంధించిన సన్నాహాలు ఊపందుకున్నాయి. ఆ గీతంలో రామ్‌చరణ్‌తో కలిసి ఆడిపాడే కథానాయికని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టింది. ఇప్పటికే పలువురు కథానాయికల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా... తెలుగమ్మాయి మానస వారణాసి కూడా ఈ రేసులోకి వచ్చింది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో ఆకట్టుకున్నారు మానస వారణాసి. చిత్రబృందం పరిశీలనలో ఆమె పేరు ఉన్నట్టు తెలుస్తోంది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' తెరకెక్కుతోంది. జాన్వీకపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. తుదిదశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా విడుదల తేదీపైన త్వరలోనే స్పష్టత రానుంది.






# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్

కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

# రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

## రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పుకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది. ఈ చిత్రంలో దీపిక పదుకొణెళి ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.



# నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్

## ఉత్తమ నటులుగా నాగచైతన్య, రష్మిక

భారతీయ సినీ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ అవార్డ్స్ 2026 విజేతలను ప్రకటించారు. ప్రతి ఏడాది దేశంలోని పలు భాషల చిత్ర పరిశ్రమలను ఒక వేదికపైకి తీసుకువచ్చే ఈ అవార్డులు, ఈసారి కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగు విభాగంలో యువసామ్రాట్ నాగచైతన్య 'తండేల్' సినిమాలో తన నటనకు గాను ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో ఉత్తమ నటిగా అవార్డు అందుకోనుంది. ఇప్పటికే ఈ ఇద్దరూ తెలంగాణ గద్దర్ అవార్డ్స్‌లో ఉత్తమ నటీనటులుగా గుర్తింపు పొందగా, ఇప్పుడు ఎకెఅంలో కూడా అదే కేటగిరీలో విజేతలుగా నిలవడం విశేషం. ఇక తెలుగు విభాగంలో ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి గాను ఎంపికయ్యారు. అదే సినిమాలో నటించిన మాస్టర్ రేవంత్ (బుల్లిరాజు)కు ఉత్తమ హాస్యనటుడిగా అవార్డు లభించింది. హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఈ సినిమాకే బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలోనూ అవార్డు రావడం విశేషం. ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రామ్ జగదీష్ ('కోర్ట్') ఎంపికయ్యారు. ఇతర భాషల్లో కూడా పలువురు ప్రముఖులు అవార్డులు సొంతం చేసుకున్నారు. తమిళంలో దుల్కర్ సల్మాన్ ఉత్తమ నటుడిగా, సిమ్రాన్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. కన్నడలో రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1' చిత్రంతో ఉత్తమ నటుడు, దర్శకుడు అవార్డులు అందుకోగా, అదే సినిమా ఉత్తమ చిత్రంగా కూడా నిలిచింది. మలయాళంలో నివిన్ పౌలీ ఉత్తమ నటుడిగా నిలిచారు. హిందీలో రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా, యామి గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏప్రిల్ 16న ముంబైలో జరగనుంది. ఈ వేడుకకు టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి మరియు బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ హోస్టులుగా వ్యవహరించనున్నారు. సీనియర్ నటి రేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.



PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656